



16 మండలాలకు ముగ్గురే ఎంఈవోలు

- అదనపు బాధ్యతలతో ఉక్కిరిబిక్కిరి
- నామమాత్రంగా పాఠశాలల పర్యవేక్షణ
- ప్రభుత్వ పాఠశాలల్లో తగ్గిన విద్యార్థుల సంఖ్య

(ఆంధ్రజ్యోతి ప్రతినిధి, కరీంనగర్)

విద్యా వ్యవస్థను మెరుగుపరచడంలో కీలకపాత్ర పోషించే మండల విద్యాధికారి (ఎంఈవో) పోస్టులను భర్తీ చేయడంలో ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోంది. దశాబ్దకాలంగా ఎంఈవో పోస్టులను భర్తీ చేయలేదు. జిల్లాలోని 16 మండలాల్లో ఒక్క రెగ్యులర్ ఎంఈవో కూడా లేరు... 16 మండలాలకు ముగ్గురు ఎంఈవోలు మాత్రమే విధులు నిర్వహిస్తున్నారు. అది కూడా సీనియర్ గెజిటెడ్ హెచ్ఎంలకు అదనపు బాధ్యతలను అప్పగించారు. దీంతో మండలాల్లో విద్యా వ్యవస్థ అస్తవ్యస్తంగా మారుతోంది. ఆ ముగ్గురు ఎంఈవోలకు 16 మండలాల బాధ్యతను అప్పగించడంతో పాఠశాలల పర్యవేక్షణ జరుగడం లేదు. మరోవైపు ఎంఈవో బాధ్యతలను నిర్వహిస్తున్న పాఠశాలల్లో కూడా హెడ్మాస్టర్లు లేక, సీనియర్ టీచర్లకు పూర్తి అదనపు బాధ్యతలను అప్పగించక పోవడంతో ఆయా పాఠశాలల్లోనూ ఇబ్బందులు తప్పడం లేదు.

● ప్రైవేట్ పాఠశాలల ఇష్టారాజ్యం

ప్రభుత్వ అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నాయి. నిబంధనలను పట్టించుకోకుండా అధిక ఫీజులు వసూలు చేస్తున్నా, పాఠశాలల్లో కనీస సౌకర్యాలు లేకపోయినా ఎవరూ పట్టించుకోవడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. మరోవైపు ప్రభుత్వ పాఠశా లల్లో అమలు చేస్తున్న మధ్యాహ్న భోజనం, ఉచిత పాఠ్య పుస్తకాలు, దుస్తులు సరిగా పంపిణీ కావడం లేదని, పాఠశాలల్లో సమస్యలు పరిష్కారానికి నోచుకోవడం లేదని విద్యార్థుల తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు.



● గెజిటెడ్ హెచ్ఎంలే ఎంఈవోలుగా..



మానకొండూర్ మండలం వేగురుపల్లి గెజిటెడ్ హెచ్ఎం ఎం మధుసూదనాచారికి ఎంఈవోగా ఆరు మండలాల బాధ్యతలను అప్పగించారు. రామడుగు మండలం గోపాల్‌రావుపేట జడ్పీహెచ్ఎస్ హెచ్ఎం అంబటి వేణుకుమార్‌కు నాలుగు మండలాలు, మరో గెజిటెడ్ హెచ్ఎం శ్రీనివాస్‌రెడ్డికి మిగిలిన ఆరు మండలాల బాధ్యతలను అప్పగించారు. ఒక్కో మండల విద్యాధికారి మండల పరిధిలోని ప్రభుత్వ పాఠశాలల్లో రోజుకొకటి చొప్పున సందర్శించాల్సి ఉంటుంది. ఆయా పాఠశాలల్లో విద్యార్థులు, ఉపాధ్యాయుల అటెండెన్స్, ప్రభుత్వం అందిస్తున్న పథకాల అమలు, సమస్యలు, విద్యాబోధన, పరీక్షల నిర్వహణ తదితర అంశాలు పరిశీలించి, రిపోర్టులను జిల్లా విద్యాధికారికి పంపించాల్సి ఉంటుంది.

పాఠశాలల్లో సమస్యలు

రెండు, మూడేళ్లుగా స్కావెంజర్లు లేక పోవడంతో పారిశుధ్య నిర్వహణ అధ్వానంగా మారింది. మరుగుదొడ్ల నిర్వహణ సరిగా ఉండడం లేదు. తాగునీటికి కూడా విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. దీంతో తల్లిదండ్రులు ప్రభుత్వ పాఠశాలల్లో పిల్లలను చేర్పించడం లేదని చెబుతున్నారు. గత ఏడాదితో పోలిస్తే ఈయేడాది అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య గణనీయంగా తగ్గింది. ప్రభుత్వం పాఠశాలలను అమ్మ ఆదర్శ పాఠశాలలను ఎంపిక ఆధునిక హంగులతో తీర్చిదిద్దుతున్నామని, తెలుగు మీడియంతోపాటు ఆంగ్లంలో విద్యాబోధన చేస్తున్నామని చెబుతోంది. ఉచితంగా పాఠ్యపుస్తకాలు, దుస్తులు, సన్న బియ్యంతో కూడిన మధ్యాహ్నభోజనం అందిస్తున్నామని చెప్పినా తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించేందుకు ముందుకు రావడం లేదు. పర్యవేక్షణ కొరవడడంతో కొన్ని పాఠశాలకు ఉపాధ్యాయులు కూడా సరిగా హాజరు కావడం లేదనే విమర్శలు ఉన్నాయి. ప్రభుత్వం స్పందించి ప్రతి మండల విద్యాధికారుల పోస్టులు భర్తీ చేయాలని జిల్లా వాసులు కోరుతున్నారు.





నార్కోటిక్ డాగ్‌తో తనిఖీలు నిర్వహిస్తున్న పోలీసులు

నగరంలో విస్తృత తనిఖీలు

కరీంనగర్ క్రైం, ఆగస్టు 22 : మత్తు పదార్థాల మహమ్మారిని అంతమొందించాలనే లక్ష్యంతో కమిషనరేట్ పోలీసులు అనుమానిత ప్రాంతాల్లో విస్తృతంగా సోదాలు నిర్వహిస్తున్నారు. సీపీ అభిషేక్ మొహంతి ఆదేశాలతో కరీంనగర్‌లోని కార్ఖానగడ్డ, నాకా చౌరస్తాల ప్రాంతాల్లోని హోటళ్లు, పాన్‌షాపులు, ఇతర అనుమానిత ప్రదేశాల్లో నార్కోటిక్ స్క్వాడ్, టాస్క్‌ఫోర్స్, కరీంనగర్ మూడో ఠాణా పోలీసులు సంయుక్తంగా గురువారం సోదాలు నిర్వహించారు. మత్తు పదార్థాలను పసిగట్టే ప్రత్యేక శిక్షణ పొందిన నార్కోటిక్ డాగ్‌తో ఈ తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా పలువురు అనుమానితులను అదుపులోకి తీసుకుని విచారణ అనంతరం వదిలిపెట్టారు. కరీంనగర్‌ను డ్రగ్స్ ఫ్రీగా మార్చడమే లక్ష్యంగా ముందుకుసాగుతున్నట్లు పోలీసు అధికారులు తెలిపారు. తనిఖీల్లో మూడో ఠాణా సీఐ జాన్‌రెడ్డి, నార్కోటిక్, టాస్క్‌ఫోర్స్ పోలీసులు పాల్గొన్నారు.

● కిసాన్‌నగర్ ప్రాంతంలో..

కరీంనగర్ కిసాన్‌నగర్ ప్రాంతంలోని గురువారం సాయంత్రం పోలీసులు తనిఖీలు నిర్వహించారు. గుడిసెల్లో నివసిస్తున్న ఇతర ప్రాంతాలకు చెందిన వారిని ఫింగర్‌ప్రింట్ డివైజ్‌తో తనిఖీ చేశారు. గతంలో ఏదైనా నేరా లకు పాల్పడనట్లయితే ఫింగర్‌ప్రింట్ డివైస్‌తో గుర్తించేందుకు ఈ తనిఖీలు నిర్వ హించామని కరీంనగర్ టౌన్ ఏసీపీ జి నరేందర్ తెలిపారు.



కిసాన్‌నగర్‌లో ఫింగర్‌ప్రింట్ డివైస్‌తో తనిఖీ చేస్తున్న పోలీసులు

సీజనల్ వ్యాధులపై జాగ్రత్త వహించాలి

సుభాష్‌నగర్, ఆగస్టు 22: సీజనల్ వ్యాధులపై జాగ్ర త్త వహించాలని జిల్లా వైద్యఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ సుజాత సూచించారు. జిల్లాలోని పట్టణ, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యాధికారులు, ఎంఎల్‌హెచ్‌పీ డాక్టర్ల తో సమావేశాన్ని గురువారం నిర్వహించారు. ఈ సంద ర్భంగా ఆమె మాట్లాడుతూ మలేరియా కేసులను గుర్తించిన వెంటనే పైరిత్రం స్ప్రే చేయాలని, నీటి నిల్వ లు ఉన్నచోట టీముపాస్ వేయించాలని సూచించారు. నీటి నిలువలను తొలగిం చాలని, పరిసరాలను పరిశు భ్రతపై అవగాహన కల్పించాలన్నారు. స్కూల్స్, హాస్టల్స్ విజిట్ చేయాలని, విద్యార్థులు దోమతెరలు వాడేలా చూడాలన్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో ప్రసవాలు అయ్యేలా చూడాలని, ఈడీడీ క్యాలెండర్ ఎంవో టేబుల్ పై ఉండాలని సూచించారు. ఓపెన్ వయల్ పాలసీ, యూవిన్ సెషన్ డే అపడేట్ చేయాలని, ఎన్‌సీడీ క్లినిక్‌లో హెచ్‌టీఎన్, డీఎం కేసులకు మందులు అందించాలన్నారు. అందరూ సమయపాలన పాటించాలన్నారు. సమావేశంలో డీఐవో డాక్టర్ సాజిద, డాక్టర్ సన, డాక్టర్ ఉమాశ్రీ పాల్గొన్నారు.

27న ఎస్సీ వర్గీకరణపై సదస్సు

సుభాష్‌నగర్, ఆగస్టు 22: జిల్లా కేంద్రంలోని ఇందిరాగార్డెన్‌లో ఈనెల 27న ఎస్సీ వర్గీకరణపై సదస్సు నిర్వహించనున్నట్లు ఉమ్మడి జిల్లా మాదిగల ఐక్యవేదిక నాయకులు తెలిపారు. గురువారం నగరంలోని ప్రెస్ భవన్‌లో సదస్సు కరపత్రాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ షెడ్యూల్డ్ కులాల ప్రజలకు సమన్యాయం జరిగేలా రాజ్యాంగంలో రిజర్వే షన్ల ద్వారా హక్కులను, అధికారాలను కల్పించినట్లు తెలిపారు. ఎస్సీ రిజర్వేషన్లతో కొంతమంది మాత్రమే లబ్ధిపొందుతున్నారని, ఎక్కువ శాతం ఉన్న మాదిగలకు అన్యాయం జరుగుతోందని మంద కృష్ణమాదిగ, గజ్జెల కాంతం లాంటి నాయకులు పోరాటాలు చేశారని తెలి పారు. రాష్ట్రంలో అధికంగా ఉన్న మాదిగలకు జనాభా దామాషా ప్రకారం 12 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలని కోరుతూ ఈనెల 27న సదస్సు తల పెట్టినట్లు తెలిపారు. మాదిగ, ఉప కులాల ప్రజలు అధిక సంఖ్య లో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. సమా వేశంలో ఆనందరావు, రాజయ్య, అజయ్, వెంకట మల్లయ్య, చంద్రయ్య, శంకర్, సంపత్, శ్రీనివాస్, నాగరాజు, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

రైతుల రుణాలన్నీ మాఫీ చేయాలి

- మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్‌కుమార్
- బీఆర్ఎస్ ఆధ్వర్యంలో జిల్లా వ్యాప్తంగా ధర్నాలు, నిరసనలు

కరీంనగర్, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): రైతులు తీసుకున్న రుణాలను ఎటువంటి ఆంక్షలు లేకుండా మాఫీ చేయాలని మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్‌కుమార్ డిమాండ్ చేశారు. గురువారం జిల్లావ్యాప్తంగా బీఆర్ఎస్ శ్రేణులు రైతు రుణమాఫీపై నిరసనలు, ధర్నాలు నిర్వహించారు. జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ ఎదుట నిర్వహించిన ధర్నా వినోద్‌కుమార్ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ఆచరణకు సాధ్యంకాని హామీలతో అధికారంలోకి వచ్చిందన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి తొమ్మిది నెలలు అవుతున్నా ఇప్పటి వరకు ఒక్క హామీ కూడా నెరవేర్చలేదని విమర్శించారు. రుణమాఫీ విషయంలో సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి మాటలకు పొంతన లేకుండా ఉందని ఎద్దేవా చేశారు. నిన్న వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు 49 లక్షల మందికి రుణమాఫీ చేయాల్సి ఉంది కానీ 22 లక్షల మందికి మాత్రమే రుణమాఫీ జరిగిందని ఒప్పుకున్నారని వినోద్‌కుమార్ చెప్పారు. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ఏడు వేల కోట్ల రుణమాఫీ జరిగిందని బ్యాంకర్ల సమావేశంలో అన్నారని, ఎవరి మాట నమ్మాలో తెలియక ప్రజలు ఆందోళన చెందుతున్నారని అన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ జిల్లా పార్టీ అధ్యక్షుడు జీవీ రామకృష్ణారావు, మేయర్ యాదగిరి సునీల్‌రావు, నగరశాఖ అధ్యక్షుడు చల్ల హరిశంకర్, మాజీ ఎమ్మెల్సీ నారదాసు లక్ష్మణ్‌రావు, సివిల్ సప్లయిస్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ సర్దార్ రవీందర్‌సింగ్, కొత్తపల్లి మున్సిపల్ చైర్మన్ రుద్ర రాజు, విండో చైర్మన్లు పెండ్యాల శ్యాంసుందర్‌రెడ్డి, తోట తిరుపతి, నాయకులు కాసారపు శ్రీనివాస్, జమీలొద్దీన్, గందె మాధవిమహేశ్, ఎడ్ల అశోక్, బోనాల శ్రీకాంత్, కర్రె పావని, బత్తిని కీర్తి, లత, రుద్ర, రాధ, గంటల రేణుక, గంగాధర చందు, సుంకిశాల సంపత్‌రావు. హుజురాబాద్‌లోఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి, గంగాధరలో మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్, మానకొండూర్‌లో బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు జీవీ రామకృష్ణారావు పాల్గొన్నారు. రామడుగు మండల కేంద్రంలో బీఆర్ఎస్ నాయకులు, రైతులతో కలిసి ధర్నా చేయగా సింగిల్ విండో చైర్మన్, రాష్ట్ర నాయకుడు వీర్ల వెంకటేశ్వర్‌రావు పాల్గొన్నారు.



కలెక్టరేట్ ముందు బీఆర్ఎస్ పార్టీ నిర్వహించిన రైతు రుణమాఫీ ధర్నాలో పాల్గొన్న బీఆర్ఎస్ నాయకులు, మాజీ ఎంపీ వినోద్‌కుమార్

'కనీస వేతనాలు అమలు చేయాలి'

కరీంనగర్ టౌన్, ఆగస్టు 22: ప్రభుత్వ పాఠశాలల్లో 23 ఏళ్లగా వంటలు చేస్తున్న తమకు కనీస వేతనాలను అమలు చేయాలని మధ్యాహ్న భోజన కార్మికులు డిమాండ్ చేశారు. ఈమేరకు గురువారం మధ్యాహ్న భోజన కార్మిక సంఘం ఆధ్వర్యంలో జిల్లా విద్యాశాఖ అధికారికి వినతిపత్రాన్ని సమర్పించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన సంఘం రాష్ట్ర కార్యదర్శి లక్ష్మణ్ మాట్లాడుతూ మధ్యాహ్న భోజన కార్మికులకు ఉద్యోగ భద్రత, పీఎఫ్, ఈఎస్ఐ కల్పించాలని, కనీస వేతనాలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్మికుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ సెప్టెంబరు 9,10 తేదీల్లో టోకెన్ సమ్మె చేయాలని రాష్ట్ర కమిటీ నిర్ణయించిందని తెలిఆరు. ఆలోగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్పందించి సమస్యలను పరిష్కరిం చాలని డిమాండ్ చేశారు. లేకపోతే అక్టోబరు 14 నుంచి నిరవధిక సమ్మె చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు బొజ్జ సాయిలు, సహకార్యదర్శి కొండ రజిత, చైనా బేగం, దుర్గవాలయ గడ్డం నాగమ్మ, మమత, రేణుక, పద్మ, లక్ష్మి, నరసవ్వ, రాజేశ్వరి, విజయ పాల్గొన్నారు.

రేపు జిల్లా స్థాయి యోగాసన పోటీలు

కరీంనగర్ స్పోర్ట్స్, ఆగస్టు 22: జిల్లా స్థాయి యోగాసన ఎంపిక పోటీలను శనివారం నిర్వహించ నున్నామని యోగా అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు సర్దార్ రవీందర్‌సింగ్, నాగిరెడ్డి సిద్దారెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. జిల్లా కేంద్రం లోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ స్టేడియంలో ఉదయం 9 గంటల నుంచి ఈ పోటీలను నిర్వహిస్తున్నా మన్నారు. పలు విభాగాల్లో మహిళలు,పురుషులకు పోటీలను నిర్వహించనున్నామని తెలిపారు. ఈ పోటీల్లో ఎంపి కైన క్రీడాకారులను ఈనెల 31 నుంచి హైదరాబాద్‌లో నిర్వహించే రాష్ట్ర స్థాయి యోగాసన పోటీలలో పాల్గొంటారన్నారు. ఆసక్తిగల వారు జనన ధ్రువీకరణ పత్రం,ఆధార్ కార్డుతో స్టేడియంలో రిపోర్టు చేయాలని సూచించారు.



దత్తత తీసుకున్న దంపతులకు పాపను అప్పగిస్తున్న కలెక్టర్ పమేలా సత్పతి

పిల్లలు లేని దంపతులు చట్టబద్ధమైన దత్తత తీసుకోవచ్చు

కరీంనగర్ టౌన్, ఆగస్టు 22: పిల్లలు లేని దంపతులు చట్టబద్ధమైన దత్తత తీసుకోవచ్చని కలెక్టర్ పమేలా సత్పతి అన్నారు. గురువారం కరీంనగర్ బాల సదనం నుంచి 10 సంవత్సరాల పాపను దత్తత తీసుకున్న జిల్లాకు చెందిన దంపతులకు కలెక్టర్ పాపను అప్పగించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అనాథ శిశువుల దత్తత, రక్త సంబంధీకుల నుంచి దత్తత తీసుకోవాలనుకునే వారు జిల్లా సంక్షేమ అధికారి కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా సంక్షేమ అధికారి ఎం సరస్వతి, పీవో తిరుపతి, శిశు గృహ మేనేజర్ తేజస్వి, కవిత, రాజేశ్, సిబ్బంది పాల్గొన్నారు.

ఎల్ఆర్ఎస్‌ను వేగవంతం చేయండి

- దరఖాస్తుల పరిశీలనకు మల్టీ డిసిప్లినరీ కమిటీ ఏర్పాటు
- మున్సిపల్ కమిషనర్ చాహత్ బాజ్‌పాయ్

కరీంనగర్ టౌన్, ఆగస్టు 22: రాష్ట్ర ప్రభుత్వం ఎల్ఆర్ఎస్ దరఖాస్తుల పరిష్కారానికి ఇచ్చిన గడువులోగా పరిశీలన వేగంగా పూర్తి చేయాలని నగరపాలక సంస్థ కమిషనర్ చాహత్ బాజ్‌పాయ్ అధికారులను ఆదేశించారు. గురువారం ఆమె నగరపాలక సంస్థ సమావేశ మందిరంలో ఎల్ఆర్ఎస్‌పై అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు 16 వేల దరఖాస్తులను పరిష్కరించాలని సూచించారు. జిల్లా రెవెన్యూ, ఇరిగేషన్ శాఖల నుంచి సిబ్బందిని ఇందుకు నియమిస్తూ కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారన్నారు. పెండింగ్‌లో ఉన్న 16,276 దరఖాస్తులపై అధికారులకు సలహాలు, సూచనలు చేస్తూ ఆదేశాలు జారీ చేశారు. జిల్లా యంత్రాంగం నుంచి వచ్చిన రెవెన్యూ ఆర్ఐలు, ఇరిగేషన్‌శాఖ ఏఈ, కార్పొరేషన్ టౌన్ ప్లానింగ్ అధికారులు డిసిప్లినరీ కమిటీగా ఏర్పడి కేటాయించిన ఏరియాల ప్రకారం ప్రత్యేక సర్వే నిర్వహించాలన్నారు. శుక్రవారం నుంచి క్షేత్రస్థాయిలో సర్వే చేసి ఫొటోలతో సహా జియో ట్యాగింగ్ ద్వారా అప్‌లోడ్ చేయాలని ఆదేశించారు. ప్రతిరోజు కనీసం 100 దరఖాస్తులను పరిష్కరించాలని ఆదేశించారు. నగరపాలక సంస్థకు చెందిన భూములు, ఇతర ప్రభుత్వ స్థలాలకు సంబంధించిన దరఖాస్తులుంటే వాటిని ప్రాసెస్ చేయవద్దని సూచించారు. టైటిల్, సైట్ క్లియరెన్సు ఉంటేనే దరఖాస్తులను పరిష్కరించాలని అన్నారు. ప్రభుత్వం ఎల్ఆర్ఎస్ అంశాన్ని ప్రాధాన్య అంశంగా తీసుకుందని, దరఖాస్తుల పరిశీలన వీలైనంత త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. విలీన గ్రామాల డివిజన్లతో సహా అన్ని దరఖాస్తులను పరిశీలించాలని సూచించారు. నగరపాలక సంస్థ కార్యాలయంలో ఎల్ఆర్ఎస్ సమస్యల పరిష్కారానికి ప్రత్యేక హెల్ప్‌డెస్క్ ఏర్పాటు చేయాలని ఆదేశించారు.

● కమిషనర్ ఆకస్మిక తనిఖీ

నగరపాలక సంస్థ కమిషనర్ చాహత్ బాజ్‌పాయ్ గురువారం కార్యాలయంలోని వివిధ విభాగాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. సిటిజన్ సర్వీస్ సెంటర్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె ఆయా విభాగాల్లో అధికారులు, ఉద్యోగుల వివరాలను, అందిస్తున్న సేవలను అడిగి తెలుసుకున్నారు. పౌరసేవా కేంద్రానికి రోజు వస్తున్న దరఖాస్తుల వివరాలు అడిగి తెలుసుకొని సలహాలు, సూచనలు చేశారు. సిబ్బంది విధి నిర్వహణలో నిర్లక్ష్యంగా వ్యవహరించవద్దని, ప్రజలకు మెరుగైన సేవలందించాలని సూచించారు.



నగరపాలక సంస్థలో సిబ్బందిని వివరాలు అడిగి తెలుసుకుంటున్న కమిషనర్ చాహత్ బాజ్‌పాయ్

సినిమా వార్తల కోసం
www.andhrajyothy.comను క్లిక్ చేయండి

హత్య కేసులో నిందితుడి అరెస్టు

కరీంనగర్ క్రైం, ఆగస్టు 22: కరీంనగర్ అశోక్‌నగర్‌లో బుధవారం వేకువ జామున జరిగిన హత్య కేసులో నిందితుడు మీర్జా ఇబ్రహీం బేగ్ అలియాస్ మీర్జా సుఫియాన్ బేగ్(20)ని గురువారం అరెస్టు చేసి కోర్టులో హాజరు పరిచామని ఒకటో టౌన్ సీఐ సరిలాల్ తెలిపారు. మద్యం విషయంలో గొడవ పడి అశోక్‌నగర్‌కు చెందిన ఎండీ ముజాయిద్‌ఖాన్(32)పై సిమెంట్ ఇటుకతో దాడి చేసి హత్య చేశాడు. దీంతో కోర్టు ఆదేశాలతో నిందితుడు సుఫియాన్‌బేగ్‌ను రిమాండ్‌కు తరలించినట్లు సీఐ సరిలాల్ తెలిపారు.

పీహెచ్‌సీని తనిఖీ చేసిన జిల్లా మలేరియా వైద్యాధికారి

శంకరపట్నం, ఆగస్టు 22: శంకరపట్నం మండలంలోని కేశవపట్నం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని గురువారం జిల్లా మలేరియా వైద్యాధికారి ఉమాశ్రీరెడ్డి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రికార్డులు పరిశీలించారు.ఆరోగ్య కేంద్రానికి వైద్యం కోసం వచ్చిన జ్వరంతో బాధపడుతున్న వారితో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. అనంతరం తాడికల్‌లో జ్వరాల బారిన పడిన వారి ఇళ్ల వద్దకు వెళ్లి రోగ లక్షణాలను అడిగి తెలుసుకున్నారు. వ్యాధి నిర్ధారణల పరీక్షల కోసం రక్త నమూనాలను సేకరించారు. పరిశుభ్రతపై వారికి అవగాహన కల్పించారు. ఆయన వెంట పీహెచ్‌సీ డాక్టర్ శ్రావణ్ కుమార్ సిబ్బంది ఉన్నారు.

పంటలను పరిశీలించిన శాస్త్రవేత్తలు


క్షేత్ర స్థాయి పర్యటనలో పాల్గొన్న శాస్త్రవేత్తలు

జగిత్యాల అగ్రికల్చర్, ఆగస్టు 22: ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం పొలాస, జిల్లా ఏరువాక కేంద్రం కరీంనగర్ బృందం ఆధ్వర్యంలో జగిత్యాల, రాజన్న సిరిసిల్ల, కరీంనగర్, పెద్దపల్లి జిల్లాల్లో రైతులు సాగు చేస్తున్న పంటలను శాస్త్రవేత్తల బృందం పరిశీలించారు. పత్తిలో ఆకుమచ్చ తెగులు, పిండినల్లి, రసం పీల్చే పురుగుల ఉధృతిని గుర్తించారు. ఆకుమచ్చ తెగులు నివారణకు ప్రోపికోనజోల్ 200 మిల్లీలీటర్లు ఎకరానికి పిచికారి చేయాలని, రసం పీల్చే పురుగు నివారణకు ఇమిడాక్లొప్రైడ్ 0.3మిల్లీటీటరు లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలన్నారు. పిండినల్లి నివారణకు ప్రొఫెనోపాస్ 3 మి.లీ నీటికి కలిపి పిచికారి చేయాలని సూచించారు. వరిలో మొగి పురుగు నివారణకు కార్టప్ హైడ్రోక్లోరైడ్ 4జీ గుళికలు ఎకరానికి 8కిలోలు లేదా క్లోరాంత్రనిలిప్రోల్ 0.4జీ గుళికలు 4 కిలోల చొప్పున చల్లుకోవాలన్నారు. వరిలో జింక్ లోపానికి 2గ్రా. జింక్ సల్ఫేట్, లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలన్నారు. మొక్కజొన్నలో ఆకుమాడు తెగులు నివారణకు ప్రోపి కోనాజోల్ 1మి.లీ లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలని సూచించారు. క్షేత్ర సందర్శనలో పొలాస పరిశోధనస్థానం శాస్త్రవేత్తలు గోన్యానాయక్, బలరాం, రవి, శ్వేత, జిల్లా ఏరువాక కేంద్రం కరీంనగర్ కో ఆర్డినేటర్ డాక్టర్ మదన్‌మోహన్‌రెడ్డి, ఆయా జిల్లాల రైతులు పాల్గొన్నారు.

బురదలో దిగబడిన బస్సు

- బయటకు నెట్టిన నాయకులు



బురదలో దిగబడిన ఆర్టీసీ బస్సు

వీర్నపల్లి, ఆగస్టు 22: మండల కేంద్రంలో డబుల్ రోడ్డు నిర్మాణ పనుల్లో భాగంగా రోడ్డును తవ్వి కాంట్రాక్టర్ నిర్లక్ష్యంగా వదిలేయడంతో వర్షాలకు ప్రధాన రహదారి బురదమయంగా మారింది. రోడ్డంతా బురదతో వాహనాల రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నారు. ఈ నేపథ్యంలో గురువారం ఉదయం వన్‌పల్లి వెళ్తున్న ఆర్టీసీ బస్సు బురదలో దిగబడిపోయింది. దీంతో ప్రయాణికులు బస్సులో నుంచి దిగారు. అక్కడే రైతు ధర్నా పాల్గొనేందుకు వచ్చిన బీఆర్ఎస్ నాయకులు బస్సును వెనకనుంచి నెడుతూ బురదలో నుంచి బయటకు తీశారు. కాంట్రాక్టర్ నిర్లక్ష్యంతోమండల ప్రజలు బురదరోడ్డుతో ఇబ్బందులు పడుతున్నాపట్టించుకునే వారు లేరని వాపోయారు.

తండాల్లో తీజ్ వేడుకలు



బావ్‌సింగ్‌నాయక్ తండాలో తీజ్ వేడుకలు నిర్వహిస్తున్న స్థానికులు

వీర్నపల్లి, ఆగస్టు 22: పలు తండాల్లో గురువారం తీజ్ వేడుకలు నిర్వహించారు. వేడుకల్లో గిరిజన యువతులు, మహిళలు ఉత్సాహంగా పాల్గొన్నారు. వీర్నపల్లి మండలంలోని బావ్ సింగ్ నాయక్ తండా, మద్దిమల్ల తండా, భూక్యతండా, జవహర్లాల్ నాయక్ తండా గ్రామాలతో పాటు పలు తండాల్లో గిరిజనులు తీజ్ పండగను గురువారం ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా అల్ ఇండియా బంజారా సంఘం జిల్లా అధ్యక్షుడు గుగులోతు సురేష్‌నాయక్ మాట్లాడుతూ తండాల్లో పెళ్లికాని ఆడపడుచులు పందిరి వేసి బుట్టలలో ఆవు ఎరువు వేసి నవధాన్యాలను నానబెట్టడం సాంప్రదాయమ న్నారు. మొలకెత్తిన నారు బుట్టలకు ఆడపడుచులు ప్రత్యేక పూజలు చేస్తారన్నారు. అనంతరం గిరిజనులు డప్పు చప్పుళ్ల మధ్య సాంప్రదాయ నృత్యాలతో నిమజ్జనం చేస్తారన్నారు. తీజ్ పండుగ గిరిజనుల సంస్కృతి సాంప్రదాయాలకు ప్రతీకగా నిలుస్తుందన్నారు. కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ గుగులోతు కళావతి, బీఆర్ఎస్ మండల మాజీ అధ్యక్షుడు శ్రీరామ్ నాయక్, మాజీ సర్పంచ్ శ్రీనివాస్ నాయక్, ఆయా తం డాల్లో తండా నాయక్‌లు, పాల్గొన్నారు.

ఎల్లారెడ్డిపేట: మండల కేంద్రంతో పాటు బుగ్గరాజేశ్వరతండా, కిష్టునాయక్‌తండా, తిమ్మాపూర్ తండా, గుంటపల్లిచెరువు తండాల్లో గురువారం సాయంత్రం తీజ్ ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. ప్రత్యేక పందిరిని ఏర్పాటు చేసి గిరిజన యువతులు వారం రోజుల పాటు ఉపవాస దీక్షలతో ప్రత్యేక పూజలు జరిపారు. భక్తిశ్రద్ధలతో గోధుమ బుట్టల్లో నీరు పోశారు. చివరి రోజున గోధుమ బుట్టలను పందిరి నుంచి తీసి డప్పుచప్పుళ్ల నడుమ ఊరేగించారు. సాంప్రదాయ పాటల మధ్య నృత్యాలు చేశారు. అనంతరం సమీప నీటి వనరుల్లో నిమజ్జనం చేశారు. కార్యక్రమంలో ప్యాక్స్ చైర్మన్ కృష్ణారెడ్డి, సెస్ డైరెక్టర్ కృష్ణహరి, తాజా, మాజీ సర్పంచులు రజిత, ప్రభునాయక్, తండా పెద్దలు తిరుపతినాయక్, సీత్యానాయక్, సూర్యనాయక్, హరిదాసునాయక్ తదితరులు పాల్గొన్నారు.



బుగ్గరాజేశ్వరతండాలో గోధుమనారు బుట్టలతో యువతులు

క్రైస్తవులకు అండగా కాంగ్రెస్ ప్రభుత్వం



మాట్లాడుతున్న దీపక్ జాన్ రాజ్

కరీంనగర్ కల్చరల్, ఆగస్టు 22: క్రైస్తవులకు అండగా కాంగ్రెస్ ప్రభుత్వం ఉంటుందని రాష్ట్ర క్రిస్టియన్ మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ దీపక్ జాన్ రాజ్ అన్నారు. గురువారం స్థానిక సీఎస్ఐ చర్చి ఆవరణలో కరీంనగర్ క్రిస్టియన్ అసోసియేషన్ ఉమ్మడి జిల్లా పాస్టర్లు ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈసందర్భంగా దీపక్ జాన్ రాజ్ మాట్లాడుతూ విద్య, వైద్య రంగాల్లో మైనారిటీ విద్యార్థుల విషయంలో శ్రద్ధ తీసుకుంటున్నామన్నారు. ఉచిత స్కాలర్‌షిప్‌లు, మైనారిటీ హాస్టళ్లలో వసతిని అందిస్తున్నామని అన్నారు. క్రైస్తవుల స్కిల్ డెవలప్‌మెంట్ కార్యక్రమాన్ని ప్రత్యేకంగా రూపొందిస్తు న్నామని అన్నారు. సీఎం రేవంత్‌రెడ్డితో ప్రత్యేక భేటీ అనంతరం తదుపరి కార్యాచరణను తెలియజేస్తామని అన్నారు. క్రైస్త వులపై జరుగుతున్న దాడులకు కొంతమంది న్యాయవాదులచే ఓ కమిటీని ఏర్పాటు చేసి దురాగతాలను అడ్డుకునే ప్రయత్నం చేస్తామని తెలిపారు. క్రైస్తవ సమాజానికి ఒక నిధిని, ప్రత్యేక బడ్జెట్‌ను కేటాయించాలని ప్రభుత్వాన్ని కోరుతామని తెలి పారు. సిఎస్ఐటీపీ ఆల్ ఇండియా బెన్ని షరీ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు జి కృపాదానం మాట్లాడుతూ గ్రామీణ యువతీ యువకులకు స్మాల్ స్కేల్ ఇండస్ట్రీస్ కింద ఉపాధి అవకాశాల విషయంలో స్పందించాలన్నారు. విద్యార్థులకు ప్రత్యేక విద్యా బోధన కార్యక్రమం కింద స్టడీ సర్కిళ్ళు ఏర్పాటు చేయాలని వినతిపత్రం సమర్పిం చారు. ఈ కార్యక్రమంలో సంస్థ అధ్యక్షుడు ఎం క్రిష్టఫర్, కార్యదర్శి ఏ సురేశ్, విపిఎస్ బాల నాయక్, ప్రేంకుమార్, పాలు ముస్తఫా, మున్సిపల్ అడిష నల్ కమిషనర్ సువార్త, ప్రసాద్, పాస్టరేట్ చైర్మన్ పాల్ కొమ్మాలు, కార్యదర్శి సిహెచ్ దేవదాసు, ఓ పవన్, అశోక్, శ్యామ్, రాజు, కృపావరం తదితరులు పాల్గొన్నారు.

పరిమితికి మించి ప్రయాణికులు

▸▸ రోడ్డుపైనే ఆర్టీసీ బస్సును నిలిపివేసిన డ్రైవర్

హుజూరాబాద్, ఆగస్టు 22: పరిమితికి మించి ప్రయాణికులు బస్సు ఎక్కారని, తాను నడపలేనంటూ ఓ ఆర్టీసీ డ్రైవర్ రోడ్డుపై బస్సును నిలిపివేశాడు. వివరాలిలా ఉన్నాయి. సిరిసిల్ల డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు గురువారం వరంగల్‌కు వెళ్తూ మధ్యలో ఉండే హుజూరాబాద్ బస్టాండ్‌కు చేరుకుంది. అక్కడ పెద్ద ఎత్తున ప్రయాణికులు బస్సులో ఎక్కారు. ఓవర్ లోడ్ అవుతుందని, బస్సును నడిపే పరిస్థితి ఉండదని డ్రైవర్ ఎంత చెప్పినా ప్రయాణికు లు వినిపించుకోలేదు. బస్సును కిలోమీటర్ నడిపిన డ్రైవర్ ఇక నడపడం తన వల్ల కాదని చెప్పి రోడ్డుపై నిలిపివేశాడు. ఆ సమయంలో బస్సులో 180 మంది ప్రయాణికులు ఉన్నారు. రియర్ వ్యూ మిర్రర్ నుంచి ఇతర వాహనాలు తనకు కనిపించడం లేదని, ఏదైనా ప్రమాదం జరిగితే తనను బాధ్యుడిని చేస్తారని, తాను బస్సు నడప లేనని ప్రయాణికులకు చెప్పాడు. బస్సులోని ప్రయాణికులు తనకు సహకరించి దిగి పోవాలని అభ్యర్థించాడు. దీంతో కొంత మంది ప్రయాణికులు డ్రైవర్ చెప్పి న విషయాన్ని గమనించి బస్సు దిగిపోయారు. దీంతో యథావిధిగా బస్సు వరంగల్‌కు వెళ్లిపోయింది. గురువారం పెళ్లిళ్లు ఉండడంతో బస్సులో రద్దీ ఎక్కువగా ఉంది.



హుజూరాబాద్‌లో రోడ్డుపై నిలిపివేసిన ఆర్టీసీ బస్సు

శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టు నుంచి కొనసాగుతున్న ఎత్తిపోతలు

పెద్దపల్లి, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టు నుంచి మిడ్ మానేరులోకి ఎత్తిపోతలు కొనసాగుతున్నాయి. గురువారం సాయంత్రం వరకు ప్రాజెక్టులోకి ఎగువ ప్రాంతం నుంచి 9064 క్యూసెక్కుల వరద నీరు వస్తున్నది. ఇందులో కడెం ప్రాజెక్టు నుంచి 3,994, క్యాచ్‌మెంట్ ఏరియా నుంచి 5072 క్యూసెక్కుల నీళ్లు వస్తున్నాయి. నంది, గాయత్రి పంప్‌హౌస్‌ల ద్వారా మిడ్ మానేరులోకి రెండు మోటార్ల ద్వారా 6300 క్యూసె క్కుల నీటిని ఎత్తిపోస్తున్నారు. ఎన్టీపీసీకి, తాగునీటి అవసరాల కోసం 433 క్యూసెక్కుల నీటిని సరఫరా చేస్తున్నారు. ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటి మట్టం 20.175 టీఎంసీలు కాగా, ప్రస్తుతం 15.352 టీఎంసీల నీళ్లు ఉన్నాయి.

శ్రీరాంసాగర్‌కు కొనసాగుతున్న ఇన్‌ఫ్లో

జగిత్యాల, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): ఎస్సారెస్పీలోకి 4,472 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వచ్చి చేరు తోంది. ప్రాజెక్టులో ప్రస్తుతం 51.023 టీఎంసీల నీరు నిల్వ ఉంది. మిషన్ భగీరథ, సాగు నీటి కాలువలు, ఇతర అవసరాలకు 4,472 క్యూసెక్కుల నీటిని వదులుతున్నారు.

రెండు పంపుల ద్వారా నీటి విడుదల

రామడుగు, ఆగస్టు 22: లక్ష్మీపూర్ గాయత్రి పంప్‌హౌస్ నుంచి శ్రీ రాజరాజేశ్వర మిడ్ మానేరు జలాశయానికి నీటి విడుదల కొనసాగుతోంది. గురువారం రెండు పంపుల ద్వారా 6,300 క్యూసెక్కుల నీటిని ఎస్ఆర్ఆర్ డ్యామ్‌కు తరలించారు. ఇప్పటి వరకు గాయత్రి పంప్‌హౌస్ నుంచి రాజరాజేశ్వర జలాశయానికి 17.6 టీఎంసీల నీటిని తరలించినట్లు అధికారులు తెలిపారు.

చికిత్స పొందుతూ చిరువ్యాపారి మృతి

ఓదెల, ఆగస్టు 22: మండలంలోని పొత్కపల్లికి చెందిన ఎండి ఖాజా (55) అనే చిరువ్యాపారి వరంగల్ ఎంజీఎం ఆసుపత్రిలో చికిత్స పొందుతూ గురువారం మృతిచెందాడు. శుక్రవారం రాత్రి తన ఇంటిలో పురుగుల మందు తాగడంతో తీవ్ర అస్వస్థతకు గురయ్యాడు. కుటుంబ సభ్యులు ఎంజీఎం ఆసుపత్రికి తరలించగా చికిత్స అనంతరం విషమించి మృతిచెందాడు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

పురుగుల మందు తాగిన యువకుడు..

మానకొండూర్, ఆగస్టు 22: మండలంలోని జగ్గయ్యపల్లి గ్రామానికి చెందిన పిట్టల ప్రవీణ్ (33) అనే యువకుడు చికిత్స పొందుతూ మృతి గురువారం చెందాడు. వివరాలు ఇలా ఉన్నాయి. ప్రవీణ్ గతంలో కరీంనగర్‌లోని ఓ ప్రయివేట్ చిట్‌ఫండ్‌లో ఉద్యోగం చేస్తూ అప్పులు చేయగా వాటిని తీర్చేందుకు తన తండ్రికి చెందిన భూమివాటాను అమ్మి అప్పులు చెల్లించిన తీరలేదు. అప్పుల భాద భరించలేక ఈ నెల 17న రాత్రి పురుగుల మందు తాగి అపస్మారక స్థితిలో ఉండగా గమనించిన కుటుంబ సభ్యులు కరీంనగర్‌కు తరలించారు. చికిత్స పొందుతూ గురువారం మృతి చెందాడు. మృతునికి భార్య, కుమారుడు, కుమార్తె ఉండగా మృతుని తండ్రీ సారయ్య పిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు స్థానిక సీఐ సదన్‌కుమార్ తెలిపారు.

అనారోగ్యంతో వృద్ధుడి ఆత్మహత్య

సైదాపూర్, ఆగస్టు 22: మండలంలోని ఘన్‌పూర్ గ్రామానికి చెందిన మజ్జిగ కొంరయ్య(90) అనే వృద్ధుడు అనారోగ్యంతో బాధపడుతూ ఇంట్లో ఎవరు లేని సమయంలో ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకా రం.. కొంరయ్య కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. దీంతో మనస్తాపం చెంది బుధవారం ఇంట్లో ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కొంరయ్య కుమారుడు బీరయ్య గురువారం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై జన్ను ఆరోగ్యం తెలిపారు.

బసంత్‌నగర్‌లో..

పాలకుర్తి, ఆగస్టు 22: మండలం పరిధిలోని బసంత్‌నగర్‌లో ఉరేసుకొని ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన బుధవారం రాత్రి చోటు చేసుకుంది. బసంత్‌నగర్ ఎస్ఐ ఆర్ స్వామి తెలిపిన వివరాల ప్రకారం.. పెరుమండ్ల తిరుపతి(50) కృష్ణానగర్ ప్రాంతానికి చెందిన వ్యక్తి. ఆరు నెలల క్రితం యాక్సిడెంట్ అయ్యి ఇంటివద్దనే ఉంటున్నాడు. దీంతో ఇంటి వద్ద భార్యభర్తలకు గొడవలు జరుగుతున్నాయి. తీవ్ర మనస్తాపం చెందిన తిరుపతి ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టినట్టు ఎస్ఐ తెలిపారు.

వ్యవసాయబావిలో జారిపడి మహిళా రైతు మృతి



సంతోషి మృతదేహం

సిరిసిల్ల క్రైం, ఆగస్టు 22: సిరిసిల్ల పట్టణం ముష్టిపల్లి గ్రామానికి చెందిన చీమ సంతోషి(26) అనే మహిళా రైతు గురువారం సాయంత్రం ప్రమాదవశాత్తు వ్యవసాయబావిలో జారిపడి మృతిచెందింది. స్థానికుల వివరాల ప్రకారం.. ముష్టిపల్లి గ్రామానికి చెందిన సంతోషి వ్యవసాయ పనులు ముగించుకొని తిరిగి ఇంటికి వస్తోంది. ఈ క్రమంలో బావిలో నీళ్లు ఉన్నాయని గడ్డపై నుంచి చూస్తుండగా గడ్డి జారీ బావిలో పడింది. ప్రమాదవశాత్తు బావిలో పడుతుండగా పక్కనే మరోమహిళా రైతు ఉంది. వెంటనే చూసిన ఆ మహిళ కేకలు వేయడంతో చుట్టుపక్కల రైతులు వచ్చి బావిలో పడిన మహిళా రైతును పైకి తీసి చికిత్స కోసం జిల్లా ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతిచెందింది. మృతురాలి భర్త మహేశ్ ఉపాధి కోసం నెలరోజుల క్రితమే దుబాయ్ వెళ్లాడు. మృతురాలికి ఇద్దరు పిల్లలు ఉన్నారు. సంఘటనపై కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నామని టౌన్ సీఐ కె. కృష్ణ తెలిపారు.

రైలు నుంచి పడి గుర్తుతెలియని దివ్యాంగుడు..

ఓదెల, ఆగస్టు 22: మండలంలోని కొలనూర్ రైల్వే స్టేషన్, 35వ, రైల్వే గేటు మధ్యలో గుర్తుతెలియని దివ్యాంగుడు రైలు నుంచి పడి మృతిచెందాడు. ఈ సంఘటన ఎప్పుడు జరిగిందనేది స్పష్టంగా తెలియడం లేదు. దీంతో మృతదేహం చీమలు, కుక్కల పాలవుతోందని రైల్వే కార్మికులు విలేకరులకు తెలిపారు. గుర్తుతెలియని ఎక్స్‌ప్రెస్ రైలు నుంచి ప్రమాదవశాత్తు జారిపడి ఉంటాడని అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. దివ్యంగుడైన ఈ వ్యక్తి బూడిద కలర్‌షర్ట్ గీతాల డబ్బాలతో ఉన్న చొక్కా ధరించి ఉన్నట్లు పోలీసులు తెలిపారు. మంగళవారం రైలు నుంచి పడి మృతిచెంది ఉంటాడని కొలనురు గ్రామస్తులు తెలిపారు. వెంటనే జీఆర్‌పీ అధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని కోరారు.

హత్య ఘటనపై సీఐ విచారణ



కొలనూర్‌లో విచారణ నిర్వహిస్తున్న సీఐ సుబ్బారెడ్డి

ఓదెల, ఆగస్టు 22: మండలంలోని కొలనూర్‌లో బుధవారం రాత్రి జరిగిన మాటూరి విజయ్ హత్య స్థలం వద్ద గురువారం సీఐ సుబ్బారెడ్డి, ఎస్ఐల బృందం సీన్ ఆఫ్ అఫెన్స్ నిర్వహించారు. బుధవారం రాత్రి మద్యం బెల్టు షాపులో ఒక వ్యక్తితో గొడవ జరగగా బయటకు వచ్చిన తర్వాత ప్రణాళికంగా హత్య జరిగిన తీరుపై సీఐ దర్యాప్తు నిర్వహించారు. అక్కడున్న నెత్తుటి నమూనాలను, హత్య జరిగిన తీరుపై నిందితుడితో జరిగిన వాగ్వాదంపై అక్కడి బెల్టుషాప్ యజమానిని విచారించారు. సిఐ వెంట ఎస్సైలు శ్రీధర్, నరేష్ కుమార్ ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్ర గాయాలు

శంకరపట్నం, ఆగస్టు 22: శంకరపట్నం మండలం కేశవపట్నం పోలీస్ స్టేషన్ సమీపంలో కరీంనగర్-వరంగల్ రహదారిపై గుర్తు తెలియని వాహనం ఢీ కొన్న ప్రమాదందో ఒకరికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. కేశవపట్నం గ్రామానికి ఆరెల్లి సారయ్య అనే వ్యక్తి గురువారం ఉదయం కాలినడకన పోలీస్ స్టేషన్ వైపు వెళ్తున్న సమయంలో కేశవపట్నం వైపు వస్తున్న ఓ ద్విచక్ర వాహనం ఢీ కొట్టడంతో ఎడమ కాలు విరిగింది. కుటుంబ సభ్యులు ఘటన స్థలానికి చేరుకొని ఆస్పత్రికి తరలించారు.

రూ.7,450 పలికిన పత్తి ధర

జమ్మికుంట రూరల్, ఆగస్టు 22: జమ్మికుంట వ్యవసాయ మార్కెట్లో క్వింటాల్ పత్తి ధర 7,450 రూపాయలు పలికింది. గురువారం మార్కెట్ యార్డుకు 12మంది రైతులు 205క్వింటాళ్ల విడి పత్తి విక్రయానికి తీసుకు వచ్చారు. ప్రైవేట్ ట్రేడర్స్ బహిరంగ వేలం పాట ద్వారా గరిష్ఠ ధర 7,450, కనిష్ఠ ధర 6,900 రూపాయలు చెల్లించి కొనుగోళ్లు చేపట్టారు.

చెట్టుకు బైక్ ఢీకొని యువకుడు మృతి

- నిశ్చితార్థానికి కొద్ది గంటల ముందే మృత్యువాత



సాధిక్(ఫైల్)

కథలాపూర్, ఆగస్టు 22: మరి కొద్ది గంటల్లోనే నిశ్చితార్థం చేసుకోవాల్సిన యువకుడు అతివేగంగా బైక్ నడిపి చెట్టుకు ఢీకొట్టి మృత్యువాత పడ్డ ఘటన పోసానిపేటలో విషాదం నింపింది. ఎస్సై నవీన్ కథనం ప్రకారం... సాధిక్ (29) అనే యువకుడు ఏడు సంవత్సరాల అనంతరం ఈ నెల 11న దుబాయి నుంచి వచ్చాడు. సాధిక్ బుధవారం సాయంత్రం తాండ్ర్యాలకు వెళ్లి వస్తానని ఇంట్లో చెప్పి బైక్‌పై వెళ్లాడు. గురువారం తెల్లవారుజాము దాకా ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు ఫోన్ చేశారు. ఎంతకూ ఫోన్ లిఫ్ట్ చేయకపోవడంతో అనుమానం వచ్చి రోడ్డు వెంట వెతుకుతూ వెళ్లారు. పోసానిపేట ఎల్లమ్మ శివారులో చెట్టుకు ఢీకొట్టుకుని పక్కనే ఉన్న గోతిలో శవమై కనిపించాడు. సాధిక్‌కు గురువారమే వరపూజ ఉండగా అనూహ్యంగా మృతి చెందడంతో కుటుంబంలో తీవ్ర విషాదం నెలకొంది. మృతుడి అన్న అన్వర్‌పాషా ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ఆర్టీసీ బస్సు ఢీకొని సింగరేణి కార్మికుడి మృతి

- ముందే హెచ్చరించిన 'ఆంధ్రజ్యోతి' కథనం



పొత్కపల్లి మూల మలుపు వద్ద ఢీకొన్న వాహనాలు , (ఇన్‌సెట్‌లో మృతి చెందిన రంజిత్‌కుమార్(ఫైల్))

ఓదెల, ఆగస్టు 22: మండలంలోని పొత్కపల్లి చెరువు మూలమలుపు వద్ద గురువా రం ఆర్టీసీ బస్సు, ద్విచక్ర వాహనం ఢీకొన్న సంఘటనలో మంచిర్యాల జిల్లా సీసీ నస్పూర్ కాలనీకి చెందిన పెంద్రు రంజిత్ కుమార్ అలియాస్ రఘు(39) అనే సింగరేణి కార్మికుడు మృతిచెందాడు. అత్తగారి గ్రామమైన జీలకుంటలో తన కొడుకు బారసాల ఉండగా మంచిర్యాల జిల్లా సీసీ నస్పూర్ కాలనీ నుంచి ద్విచక్ర వాహనంతో వస్తుండగా, జమ్మికుంట నుంచి సుల్తానాబాద్ వైపు వెళుతున్న ఆర్టీసీ బస్సు పొత్కపల్లి ఊర చెరువు మూలమలుపు వద్ద ఢీకొన్నాయి. ఈ సంఘటనలో రంజిత్ కుమార్ తీవ్ర గాయాలకు గురికాగా సుల్తానాబాద్ ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతిచెందాడు. ఇప్పటివరకు పొత్కపల్లి పోలీస్ స్టేషన్‌లో ఎలాంటి ఫిర్యాదు అందలేదు. కాగా, ఈనెల 13న, పొత్కపల్లి చెరువు మూలమలుపుపై 'ఆంధ్రజ్యోతి'లో మూలమలుపు వద్ద పొంచి ఉన్న ముప్పు అనే కథనం ప్రచురితమైంది. అయినప్పటికీ అధికారులెవరూ పట్టించుకున్న దాఖలాలు లేవు. ఇంతలోనే మరో రోడ్డు ప్రమాదం సంభవించి తన కొడుకును కళ్లారా చూసుకోక ముందే సింగరేణి కార్మికుడు దుర్మరణం చెందాడు.

రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ వ్యక్తి మృతి

గన్నేరువరం, ఆగస్టు 22: మండల కేంద్రంలో రెండు ద్విచక్రవాహనాల ఢీకొన్న ప్రమాదంలో గాయపడ్డ మండలంలోని మైలారం గ్రామానికి చెందిన కాదసి ఎల్లస్వామి(60) చికిత్స పొందుతూ బుధవారం రాత్రి మృతి చెందాడు. ఎస్ఐ తాండ్ర నరేష్ తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని మైలారం గ్రామానికి చెందిన కాదసి ఎల్లస్వామి ద్విచక్రవాహనం (ఏపీ15ఏ25560)పై సోమవారం గన్నేరువరం వచ్చి వెళుతున్న క్రమంలో తహసీల్దారు కార్యాలయం సమీపంలో ఎదురుగా గన్నేరువరం గ్రామానికి చెందిన బుర్ర రాజ్‌కోటి బైక్ (టీఎస్02ఈబి7263) ఢీకొట్టినట్లు ఎల్లస్వామి కూతురు వనజ పోలీసులకు ఫిర్యాదు చేసింది. అలాగే బుర్ర రాజ్‌కోటి తహసీల్దారు కార్యాలయం ఎదుట తన బైక్‌ను రోడ్డు పక్కన పెట్టుకుని ఉండగా మైలారం గ్రామస్థుడు కాదసి ఎల్లస్వామి తన ద్విచక్రవాహనంతో ఢీకొట్టినట్లు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు మేరకు ఇరువర్గాలపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేసినట్లు ఎస్ఐ తెలిపారు. ఈ ప్రమాదంలో ఎల్లస్వామికి తలకు తీవ్రగాయాలు కావడంతో కరీంనగర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో వరంగల్‌లోని ఎంజీఎం ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ బుధవారం రాత్రి మృతి చెందాడు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

పెద్దపల్లి రైల్వే స్టేషన్‌ను సందర్శించిన డీజీఎం



డీఆర్ఎంకు వినతి పత్రం ఇస్తున్న ఫోరం సభ్యులు

పెద్దపల్లి, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): సికింద్రాబాద్ డివిజనల్ రైల్వే మేనేజర్ భారతీష్ కుమార్ జైన్ గురువారం పెద్దపల్లి రైల్వే స్టేషన్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన ఇక్కడ జరుగుతున్న రైల్వే స్టేషన్ ఆధునికీకరణ పనులను పరిశీలించారు. ప్లాట్ ఫారంలు, స్టేషన్‌ను పరిశీలించారు. పెద్దపల్లి నుంచి నిజామాబాద్, కాజీపేట నుంచి సిర్పూర్ కాగజ్‌నగర్ సెక్షనలలో నెలకొన్న రైల్వే సమస్యలను పరిష్కరించాలని ఉత్తర తెలంగాణ రైల్వే ఫోరం ఉపాధ్యక్షుడు అజయ్ క్రాంతి సింగ్, కమిటీ సభ్యుడు దేవి సింగ్ ఠాకూర్ డీఆర్ఎంకు వినతిపత్రం అందజేశారు. తిరుపతి- కరీంనగర్ బై వీక్లీ ఎక్స్‌ప్రెస్ రైలును నిజామాబాదు వరకు పొడిగించి వారానికి ఐదు రోజులు నడపడాలని, కరీంనగర్ నుంచి సికింద్రాబాద్‌కు వందే మెట్రో ఎక్స్‌ప్రెస్ రైలు నడపాలని, నిజామాబాదు నుంచి వరంగల్‌కు మెము ఎక్స్‌ప్రెస్ పుష్ పుల్ రైలు వయా పెద్దపల్లి మీదుగా నడపాలని, కాజీపేట నుంచి దాదర్ ముంబై వీక్లీ ప్రత్యేక రైళ్ళను పునరుద్ధరించడంతో పాటు వాటిని వారానికి మూడు రోజులు పెంచాలని కోరారు. పెద్దపల్లి, బల్లార్షా మీదుగా కోల్‌కతాకు నూతన రైలు సర్వీసు నడపాలని, పూర్వ నాగపూర్ ప్యాసింజర్ రైలును పునరుద్ధరించి చర్లపల్లి టెర్మినల్ వరకు పొడిగించాలని విజ్ఞప్తి చేశారు.

ఘనంగా విగ్రహ ప్రతిష్ఠా మహోత్సవం



కల్యాణం నిర్వహిస్తున్న వేదపండితులు

కోరుట్ల, ఆగస్టు 22: పట్టణంలోని అతి పురాతన ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠా మహోత్సవ కార్యక్రమం గురువారం ఘనంగా జరిగింది. ఆలయంలో శ్రీలక్ష్మీదేవి, విష్వక్సేన, ఆంజనేయ, ద్వార పాలక రాజగోపుర శిఖర, విమాన వేంకటేశ్వర స్వామి విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమాన్ని వేద పండితులు చక్రపాణి మాధవాచార్య, చక్రపాణి నరసింహమూర్తి, బీర్నంది నరసింహచారి మంత్రోచ్ఛారణ మధ్య సాగింది. ఈ సందర్భంగా ఆలయంలో స్వామి వారి కల్యాణం జరిపారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్ని అన్నప్రసాదం స్వీకరించి మొక్కులు చెల్లించుకున్నారు. మెట్‌పల్లి డీఎస్పీ ఉమామహేశ్వర్‌రావు, కాంగ్రెస్ సీని యర్ నాయకులు జువ్వాడి కృష్ణారావు ప్రత్యేక పూజలలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ అన్నం లావణ్య - అనిల్, కౌన్సిలర్ పు ప్పాల ఉమాదేవి - ప్రభాకర్, ఎంబేరి నాగభూషణం, పెండం గణేష్, ఆడెపు కమల - మధు, దేవాలయ ఈవో విక్రం, సీనియర్ అసిస్టెంట్ నర్సయ్య, నాయకులు జక్కుల ప్రసాద్, కొత్త సురేష్, గంద్ర అజేందర్‌రావు, జుబర్తి రమేశ్, వేంకటేశ్వర భజన మండలి సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

సంకటహర చతుర్థి పూజలు



గణపతి ఆలయంలో అభిషేకం చేస్తున్న అర్చకులు

ధర్మపురి, ఆగస్టు 22: ధర్మపురి క్షేత్రంలోని శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి అనుబంధ శ్రీ రామలింగేశ్వర స్వామి ఆలయం వద్ద గల గణపతి దేవాలయంలో సంకటహర చతుర్థి పూజలు గురువారం ఘనంగా నిర్వహించారు. ఆలయంలో లోక కల్యాణార్థం గణనాథుడికి వేదపండితులు పాలెపు ప్రవీణ్‌కుమార్‌శర్మ తదితర వేదబ్రాహ్మణుల మంత్రోచ్ఛారణల మధ్య శాస్త్రోక్తం గా ఉపనిషత్‌లతో అభిషేకం, విశేష పూజలు, హారతి, మంత్ర పుష్పం నిర్వహించారు. సకల కష్టాలు తొలగిపోవాలని కోరుతూ అర్చకులు ఈ పూజా కార్యక్రమాలు నిర్వహించారు. గోదావరి నదిలో స్నానాలు చేసిన భక్తులు ఉదయం నుండి సాయంత్రం వరకు స్వామి వారిని దర్శనం చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈవో సంకటాల శ్రీనివాస్, సూపరింటెండెంట్ ద్యావళ్ల కిరణ్ సీనియర్ అసిస్టెంట్ అలువాల శ్రీనివాస్, అభిషేక్ పౌరోహితులు బొజ్జ సంతోష్‌కుమార్, అర్చకులు ద్యావళ్ల విశ్వనాథ్‌శర్మ, సాయికుమార్ తదితరులు పాల్గొన్నారు.

మాదక ద్రవ్యాల నిరోధంపై అవగాహన

కరీంనగర్ క్రైం, ఆగస్టు 22: వివేకానంద డిగ్రీ అండ్ పీజీ కళాశాలలో మాదక ద్రవ్యాల నిరోధంపై అవగాహన కార్యక్రమం నిర్వహించినట్టు కళాశాల ఎన్ఎస్ఎస్ అధికారి ధనపురి సాగర్ తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా డిస్ట్రిక్ట్ ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ ఆఫీసర్ శ్రీనివాసరావు విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ డ్రగ్స్, గంజాయి, ధూమపానం వంటి వ్యసనాలకు యువత బానిసైతే జీవితమే అంధకారం అవుతున్నారు. విద్యార్థులు బాగా చదివి ఉన్నతంగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించిన కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సిహెచ్ శ్రీనివాస్ మాట్లాడుతూ తల్లిదండ్రులు తమ పిల్లల కోసం కొంత సమయాన్ని కేటాయించి వారిని ఎల్లప్పుడూ గమనిస్తూ ఉండాలన్నారు. ఏ చిన్న మార్పు కనిపించినా వారిని మందలించి తగిన సూచనలు చేసి వారిని సన్మార్గంలో నడిపించాలని తెలిపారు. మరో అతిథి డిస్ట్రిక్ కోఆర్డినేటర్, చైల్డ్ హెల్ప్ లైన్ ఎ సంపత్ మాట్లాడుతూ ప్రతి విద్యార్థి దేశ నిర్మాణంలో భాగస్వాములు కావాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులచే డ్రగ్స్ రహిత సమాజ నిర్మాణం కోసం పాటుపడతామని ప్రతిజ్ఞ చేయించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో ఎక్సైజ్ ఎస్ఐ రాబర్ట్, సామాజిక సేవకురాలు కవిత దేవి ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ ధనపురి సాగర్, భైరి మహేష్ ఏసిఓ బి.సంపత్ కుమార్, ఏవో బి శ్రవణ్ కుమార్ కాన్షియస్నెస్ క్లబ్ సభ్యులు జశ్వంత్సింగ్, శ్రీనాథ్‌రెడ్డి, రాజేష్, రాజు, అధ్యాపక బృందం, ఎన్ఎస్ఎస్ వలంటీర్స్ విద్యార్థులు పాల్గొన్నారు.

అనారోగ్యంతో యువకుడి మృతి

కరీంనగర్ క్రైం, ఆగస్టు 22 : కొత్తపల్లి మండలం బావుపేటకు చెందిన దెక్కొండ సాయిప్రసాద్(29) అనారోగ్యంతో మృతి చెందాడని మృతుని కుటుంబ సభ్యులు తెలిపినట్లుగా కొత్తపల్లి పోలీసులు పేర్కొన్నారు. ఎల్ఐసీ ఏజెంట్‌గా పనిచేస్తున్న దెక్కొండ సాయిప్రసాద్(29) నాలుగు రోజుల కిందట జ్వరంకు గురికాగా స్థానిక ఆర్ఎంపీ డాక్టర్ ఇంజక్షన్ ఇచ్చారని, ఆ తరువాత జ్వరం తగ్గకపోవటంతో హైరాబాద్‌లోని ఒక ప్రైవేట్ ఆసుపత్రికి తరలించి చికిత్స చేయిస్తుండగా బుధవారం మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. అయితే ఆర్ఎంపీ డాక్టర్ ఇంజక్షన్ వికటించడంతోనే సాయిప్రసాద్ మరణించాడని మొదట మృతుడి కుటుంబ సభ్యులు పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు వెళ్ళి స్థానికంగా విచారణ జరిపి మృతుడి కుటుంబ సభ్యులను ఫిర్యాదు ఇవ్వాలని కోరగా సాయిప్రసాద్ అనారోగ్యంతోనే మరణించినట్లు చెప్పారని, ఈ మేరకు ఫిర్యాదు తీసుకున్నట్లు పోలీసులు తెలిపారు.

భక్తిశ్రద్ధలతో సంకటహర చతుర్థి పూజలు



అంజనాద్రి లక్ష్మీగణపతి ఆలయంలో హారతి ఇస్తున్న అర్చకుడు

కరీంనగర్ కల్చరల్, ఆగస్టు 22: నగరంలోని ఆలయాల్లో గురువారం సంకటహర చతుర్థి పూజలను భక్తులు భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. పలు దేవాలయాల్లో జరిగిన అభిషేక, అలంకార, అర్చనల్లో, గణపతి హవనాల్లో భక్తులు పాల్గొన్నారు. పూజల అనంతరం మహాప్రసాద వితరణ చేశారు. భగత్‌నగర్ అంజనాద్రి లక్ష్మీగణ పతి ఆలయంలో చిలుకపాటి హనుమంతారావు, సభ్యులు పాల్గొన్నారు. జెడ్‌పి క్వార్టర్స్ ఆవరణలోని అయ్యప్ప ఆలయంలో ఈఓ కొన్న కాంతారెడ్డి, దీక్షాపరులు పాల్గొన్నారు. అశోక్‌నగర్ వాసవికన్యకాపరమేశ్వరి ఆలయంలో అధ్యక్ష కార్యదర్శులు చిట్టుమల్ల శ్రీనివాస్, కాచం రాజేశ్వర్, కోశాధికారి బొల్లం శ్రీనివాస్, సంకష్ట కన్వీనర్ రాచమల్ల భద్రయ్య, సభ్యులు పాల్గొన్నారు. ప్రకాశంగంజ్ వరసిద్ధి వినాయకస్వామి ఆలయంలో స్థానిక వ్యాపారులు పాల్గొన్నారు. పాతబజార్ గౌరీశంకర దేవాలయంలో ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త ప్రొద్దుటూరి శ్రీనివాస్, ఈఓ వుడుతల వెంకన్న పాల్గొన్నారు. రాంపూర్ గిద్దెపెరుమాండ్లు, కమాన్‌రోడ్ రామేశ్వర, చైతన్యపురి మహాశక్తి ఆలయాలతో పాటు పలు ఆలయాల్లో భక్తులు పాల్గొన్నారు.

గాలి శ్రీనివాస్‌కు డాక్టరేట్



గణేశ్‌నగర్, ఆగస్టు 22 : ఎస్‌యూ రసాయన శాస్త్ర విభాగ పరిశోధకుడు గాలి శ్రీనివాస్‌కు విశ్వ విద్యాలయ ఇన్‌చార్జి పరీక్షల నియంత్రణ అధికారి ఆచార్య శ్రీ రంగ ప్రసాద్ డాక్టరేట్ గురువారం ప్రకటించారు. డాక్టర్ గాలి శ్రీనివాస్ 'సింథసిస్, మాలిక్యులర్ డాకింగ్ స్టడీస్ అండ్ బయోలాజికల్ ఎవాల్యూషన్ ఆఫ్ సమ్ నావెల్ బెంజిమిడజోల్ బేస్డ్ హైబ్రీడ్స్ అండ్ తయజోలిడినోన్ లింక్డ్ డెరివేటివ్స్' అనే అంశంపై రసాయన శాస్త్ర విభాగ ఆచార్యులు డాక్టర్ వినమ్రత పర్యవేక్షణలో పూర్తి చేశారు. కరీంనగర్ జిల్లా ఎలగందుల గ్రామానికి చెందిన గాలి శ్రీనివాస్ ఎస్ఆర్ఆర్ ప్రభుత్వ కళాశాలలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పనిచేసి ఈ మధ్య జరిగిన బదిలీల్లో సిద్దిపేటకు బదిలీ అయ్యారు.

29నుంచి మండల స్థాయి పాఠశాలల క్రీడలు

హుజూరాబాద్, ఆగస్టు 22: హుజూరాబాద్ పట్టణంలోని హైస్కూల్ మైదానంలో ఈ నెల 29నుంచి 31వరకు మండల స్థాయి పాఠశాలల అండర్-14, అండర్-17 బాల బాలికల క్రీడోత్సవాలు నిర్వహిస్తున్నట్లు ఎంఈవో కె శ్రీనివాసరెడ్డి, ఎస్‌జీఎఫ్ కార్యదర్శి సారయ్య గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. కబడ్డీ, ఖోఖో, వాలిబాల్, అథ్లెటిక్స్ పోటీలను నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. క్రీడల్లో పాల్గొనే విద్యార్థినీ, విద్యార్థులు తాము చదువుకుంటున్న పాఠశాల నుంచి జనన ధ్రువీకరణ పత్రం, ఆధార్‌కార్డు జిరాక్స్ తప్పకుండా తీసుకురావాలని సూచించారు. విద్యార్థులు క్రీడలను సద్వినియోగం చేసుకోవాలని వారు సూచించారు.,

వాహనదారులు నిబంధనలు పాటించాలి

హుజూరాబాద్, ఆగస్టు 22: వాహనదారులు నిబంధనలు పాటించాలని టౌన్ సీఐ తిరుమల్ అన్నారు.పట్టణంలోని డిపో క్రాస్ వద్ద గురువారం వాహనాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా నంబర్లు ప్లేట్లు లేని, అస్తవ్యస్తంగా నంబర్లు ప్లేట్లు ఉన్న 40 ద్విచక్ర వాహనాలను సీజ్ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రతి వాహనదారుడు రవాణా చట్టం ప్రకారం నంబర్ ప్లేట్లు కలిగి ఉండాలన్నారు. వాహనాలు నడిపేటప్పుడు తప్పకుండా డ్రైవింగ్ లైసెన్స్, వాహన పత్రాలు వెంట తెచ్చుకోవాలని చెప్పారు. ప్రతి ఒక్కరూ నిబంధనలు పాటిస్తూ డ్రైవింగ్ చేయాలని సూచించారు.

జర్నలిస్టుల నివేశన స్థలాల సమస్య పరిష్కరించాలి

హుజూరాబాద్, ఆగస్టు 22: హుజూరాబాద్ జర్నలిస్టులకు కేటాయించిన నివేశన స్థలంలో కొన్ని రకాల ఇబ్బందులు ఉన్నాయని, వాటిని వెంటనే పరిష్కరించాలంటూ ప్రెస్‌క్లబ్ ఆధ్వర్యంలో గురువారం ముఖ్యమంత్రి కార్యాలయానికి లేఖను పోస్టు చేశారు. 20ఏళ్లుగా ఇబ్బందులు ఎదుర్కొంటూ జర్నలిస్టు వృత్తిని కొనసాగిస్తున్నా మన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వంలో కలెక్టర్ ఆదేశాలతో పట్టాలు వచ్చాయని, అందులో నిర్మాణాలు కూడా పూర్తి చేశామని తెలిపారు. దానిపై పూర్తి స్థాయిలో ముఖ్యమంత్రి ఈఎన్‌సీ ఇవ్వాలని కోరుతూ లేక పంపించామన్నారు. కార్యక్రమంలో ప్రెస్‌క్లబ్ సభ్యులు రాములు, సాయికృష్ణ, సత్యరాజ్, శ్రీధర్, సతీష్, తిరుపతి, మహేష్, కుమార్, అబ్దుల్ ఫహీం తదితరులు పాల్గొన్నారు.

పీఆర్టీయూ మండల కార్యవర్గం



ఎన్నికైన పీఆర్టీయూ మండల కార్యవర్గం

జమ్మికుంట, ఆగస్టు 22: జమ్మికుంట పట్టణంలోని ప్రభుత్వ బాలుర పాఠశాలలో పీఆర్టీయూ మండల కార్యవర్గాన్ని గురువారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా పంజాల కృష్ణమూర్తి, ప్రధాన కార్యదర్శిగా మేకల రాంరెడ్డి, అసోసియేట్ అధ్యక్షుడిగా కె రవీందర్‌రెడ్డి, మహిళా ఉపాధ్యాయురాలిగా కేతిరి శ్రీలత, కార్యదర్శిగా సీహెచ్ ప్రవీణ్, మహిళా కార్యదర్శిగా రజిత ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా ఎన్నికైన సభ్యులు మాట్లాడుతూ ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి పీఆర్టీయూ ఎల్లవేళలా పాటుపడుతుందని తెలిపారు. ఈ సందర్భంగా ప్రమాణ స్వీకార కార్యక్రమం నిర్వహించారు.

'పేదల అభ్యున్నతికి పాటుపడిన ఆర్‌బీవీఆర్‌ఆర్'

సమాజ శ్రేయస్సు కోసం తపించిన వెంకటరాంరెడ్డి



ఆర్‌బీవీఆర్‌ఆర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు కృష్ణారెడ్డి, పరిరక్షణ సమితి సభ్యులు

భగత్‌నగర్, ఆగస్టు 22: పేదల అభ్యున్నతికి రాజబహద్దూర్ వెంకటరాంరెడ్డి పాటు పడ్డారని బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి అన్నారు. గురువారం రాజబహద్దూర్ వెంకటరాంరెడ్డి జయంతిని పురస్కరించుకొని నగరంలోని ఆర్‌బీవీఆర్‌ఆర్ చౌరస్తాలో ఆయన విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈసందర్భంగా గంగాడి కృష్ణారెడ్డి మాట్లాడుతూ విద్యద్వారానే సమాజంలో మెరుగైన మార్పు సాధ్యమని సొంతనిధులతో ఆయన విద్యా సంస్థలు నెలకొల్పి ఎందరికో విద్యా ప్రధాతగా నిలిచారన్నారు. కార్యక్రమంలో మాడ వెంకట్‌రెడ్డి, ఇనుకొండ నాగేశ్వర్‌రెడ్డి, బండ రమణారెడ్డి, ఎడమ సత్యనారాయణరెడ్డి, మోతె గంగారెడ్డి, జితేందర్‌రెడ్డి, ప్రభాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

●రాజబహద్దూర్ వెంకటరాంరెడ్డి జయంతి వేడుకలు నగరంలో ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా పేదరెడ్డి విద్యార్థులకు అల్ఫోర్స్ విద్యా సంస్థల చైర్మన్ డాక్టర్ వి నరేందర్‌రెడ్డి ఐదుగురికి, డాక్టర్ శ్రీలతమోహన్‌రెడ్డి ఐదుగురికి, ఆర్‌బీవీఆర్‌ఆర్ విజ్ఞాన పరిషత్ ఆధ్వర్యంలో 19 మందికి ఉపకార వేతనాలు అందించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత నరేందర్‌రెడ్డి హాజర వగా, రాజబహద్దూర్ వెంకటరాంరెడ్డి రెడ్డి సంక్షేమ సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు నరహరి జగ్గారెడ్డి, కార్యదర్శి బండ గోపాల్‌రెడ్డి, కోశాధికారి కాసర్ల మధూకర్‌రెడ్డి, పెండ్యాల కేశవరెడ్డి, ఇనుకొండ నాగేశ్వర్‌రెడ్డి, గన్ను మహేశ్వర్‌రెడ్డి, దాసరి రాంరెడ్డి, దారం జగన్నాథ‌రెడ్డి, ద్యావ భాస్కర్ రెడ్డి, కంది అశోక్‌రెడ్డి, చింతల శ్రీనివాస్‌రెడ్డి, ఏనుగు చుక్కారెడ్డి, నల్ల కొండాల్‌రెడ్డి, చింతిరెడ్డి రమణారెడ్డి, గుజ్జుల రేష్మ పాల్గొన్నారు.

●**గణేశ్‌నగర్:** రాజా బహద్దూర్ వెంకటరాంరెడ్డి జయంతి సందర్భంగా ఎస్ఆర్ఆర్ కూడలిలో ఉన్న ఆర్‌బీవీఆర్‌ఆర్ విగ్రహానికి ఆర్‌బీవీఆర్‌ఆర్ పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆర్‌బీవీ ఆర్ఆర్ పరిరక్షణ సమితి సభ్యులు ఆయన చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో ఆర్‌బివిఆర్‌ఆర్ కోశాధికారి కాసర్ల మధుకర్‌రెడ్డి, సంయుక్త కార్యదర్శి దారం జగన్నాథ్‌రెడ్డి, కార్యవర్గ సభ్యులు ఏనుగు చొక్కారెడ్డి, రెడ్డి కరీంనగర్ బార్ అసోసియేషన్ జనరల్ సెక్రెటరీ బేతి మహేందర్‌రెడ్డి, ఐక్యవేదిక రాష్ట్ర కార్యదర్శి సంది తిరుపతిరెడ్డి, ఉపాధ్యక్షులు రేకులపల్లి రవీందర్‌రెడ్డి, ఆర్‌బీవీఆర్‌ఆర్ పరిరక్షణ సభ్యులు న్యాలకొండ ప్రసన్నరెడ్డి, ఎడబోయిన శ్రీనివాస్‌రెడ్డి, ఈశ్వర్‌రెడ్డి, కంఠారెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, చెన్నాడి రాజేశ్వర్ రెడ్డి, రావుల కిరణ్‌రెడ్డి, ఎడవల్లి శశిధర్‌రెడ్డి, నోముల రాహుల్‌రెడ్డి పాల్గొన్నారు.

పారమితలో క్రీడా వేడుకలు ప్రారంభం

కరీంనగర్ స్పోర్ట్స్, ఆగస్టు 22: జిల్లా కేంద్రంలోని పారమిత హెరిటేజ్ పాఠశాలలో జాతీయ క్రీడా దినోత్సవాన్ని పురస్కరించుకొని విద్యార్థులకు క్రీడా పోటీలను గురువారం ప్రారంభించారు. ఈ పోటీలను పాఠశాల డైరెక్టర్ రమణ, క్రీడాకారులను పరిచయం చేసుకొని ప్రారంభించగా, విద్యార్థులకు బాస్కెట్‌బాల్, వాలీబాల్, త్రోబాల్, క్రికెట్, క్యారం, చెస్ క్రీడలను జూనియర్, సీనియర్ విభాగాలల్లో మూడు రోజులపాటు నిర్వహించనున్నారు. ఈ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు జాతీయ క్రీడా దినోత్సవం రోజున బహుమతులను అందించనున్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల చైర్మెన్ డాక్టర్ వి ప్రసాద్‌రావు, ప్రోగ్రాం హెడ్ గోపీకృష్ణ, డైరెక్టర్లు రష్మిత, ప్రసూన, అనూకర్‌రావు, వినోద్‌రావు, పీఈటీలు మహేశ్, రాజు, విద్యార్థులు పాల్గొన్నారు.

రక్తదానం

సుభాష్‌నగర్, ఆగస్టు 22: మెగాస్టార్ చిరంజీవి జన్మదినం సందర్భంగా గురువారం వైకె ఫౌండేషన్ జిల్లా ఇన్‌చార్జి బుర్ర బాబు రక్తదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అత్యవసర సమయాల్లో రక్తం దొరక్క ప్రాణాపాయ స్థితికి చేరుకుంటున్నారని అన్నారు. రక్తదానం చేసి ప్రాణదాతలు కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో గోవర్ధన్, రాజు, గణేశ్, సంపత్ తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలి

కరీంనగర్ రూరల్, ఆగస్టు 22: ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని ఎంపీడీవో సంజీవరావు అన్నారు. కరీంనగర్ మండలం పలు గ్రామాల్లో నాటుదాం ఒక్క చెట్టు-అమ్మ పేరు మీద అనే కార్యక్రమంలో భాగంగా గురువారం మొక్కలు నాటారు. కరీంనగర్ మండలం నగునూర్, చేగుర్తి, గోపాల్‌పూర్, చామనపల్లి దుర్శేడ్ గ్రామాల్లో మొక్కలు నాటే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈకార్యక్రమంలో ఎంపీడీవో సంజీవరావు, ఎపీఓ జగన్మోహన్‌రెడ్డి, ఎపీవో శోభరాణి హజ్జరై మొక్కలు నాటారు. ఈసందర్భంగా ఎంపీడీవో సంజీవరావు మాట్లాడుతూ లక్ష్యం మించి మొక్కలు నాటేందుకు ఉపాధి హామీ పథకం ద్వారా ప్రణాళిక చేపట్టడం జరిగిందని తెలిపారు. గ్రామాల్లోని ఖాళీ స్థలాలు, రోడ్డు పక్కల స్థలాలు, ప్రభుత్వ స్థలాలను గుర్తించి మొక్కలు నాటుతున్నట్లు ఆయన తెలిపారు. కేంద్ర ప్రభుత్వం అమ్మ పేరు మీద మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టడం జరిగిందని ప్రతి ఒక్కరూ అమ్మ పేరిట మొక్కలు పెట్టి వాటికి పేరు పెట్టి పోషణ బాధ్యత చూసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఉపాధి హామి ఎపిడి కృష్ణ, పంచాయతీ ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులు, ఎపీఓలు, ఈసీలు పాల్గొన్నారు.

●**చిగురుమామిడి:** మండల వ్యాప్తంగా విరివిగా మొక్కలు నాటి సంరక్షించాలని మండల ప్రత్యేక అధికారి డాక్టర్ పి శ్రీనివాస్ అన్నారు. మండల కేంద్రంలో గురువారం గ్రామ శివారులో గల పామ్‌బండ వద్ద నాటుదాం ఒక చెట్టు- అమ్మ పేరు మీద అనే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మొక్కలు నాటారు. కార్యక్రమంలో తహసీల్దార్ ముద్దసాని రమేశ్, ఎంపీడీవో ఎండి ఖాజామొయినోద్దీన్ పాల్గొన్నారు.

●**గంగాధర:** పర్యావరణ పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి సంరక్షించాలని మెము సైతం స్వచ్ఛంద సంస్థ సభ్యులు అన్నారు. గంగాధర మండలం ఉప్పరమల్యాలలో సంస్థ ఆధ్వర్యంలో నాటుదాం ఒక చెట్టు అమ్మ పేరున కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా గ్రామంలో ఐదు వందల మొక్కలను దారివెంట నాటారు. కార్యక్రమంలో సభ్యులు అజయ్, తిరుపతి పాల్గొన్నారు.

పారిశుధ్య కార్మికుల రక్షణే పాలకవర్గ లక్ష్యం



కార్మికులకు పీపీ కిట్లను పంపిణీ చేస్తున్న మేయర్ సునీల్‌రావు, కమిషనర్

కరీంనగర్ టౌన్, ఆగస్టు 22: నగరంలో పారిశుధ్య పనులను నిర్వహిస్తూ ప్రజారోగ్యం కోసం నిరంతరం కృషిచేస్తున్న కార్మికుల రక్షణే తమ పాలకవర్గ లక్ష్యమని నగర మేయర్ యాదగిరి సునీల్‌రావు అన్నారు. గురువారం సాయంత్రం నగర పాలక సంస్థ సమావేశమందిరంలో కమిషనర్ చాహత్‌బాజ్‌పాయ్‌తో కలిసి పారిశుధ్య కార్మికులకు పీపీ కిట్ల పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ నగరపాలక సంస్థకు దేశంలో గొప్ప పేరుతోపాటు నాలుగు కోట్ల నగదు బహుమతి రావడం పారిశుధ్య కార్మికుల శ్రమ ఫలితమేనని అన్నారు. పారిశుధ్యం మరింత మెరుగు పరిచేందుకు, కార్మికుల పని భారం తగ్గే విధంగా ఆధునిక యంత్రాలను కొనుగోలు చేసి వాటిని వినియోగిస్తున్నామని చెప్పారు. గతంలో కొనుగోలు చేసిన చెత్త ట్రాక్టర్లు చెడిపోయాయని, కొత్తగా మరో 38 ట్రాక్టర్లను, 10 స్వచ్ఛ ఆటోలను, వాటర్ సప్లయి కోసం 10 ట్రాక్టర్లు కొనుగోలు చేస్తున్నామని చెప్పారు. కమిషనర్ మాట్లాడుతూ మొదటి ప్రాధాన్యత పారిశుధ్య నిర్వహణ అని చెప్పారు. పారిశుధ్య కార్మికులను రక్షించు కునేందుకు అన్ని సౌకర్యాలు కల్పిస్తామని చెప్పారు. ఈకార్యక్రమంలో డిప్యూటీ మేయర్ చల్లా స్వరూపరాణి, అదనపు కమిషనర్ సువార్త, డిప్యూటీకమిషనర్ స్వరూపరాణి, అసిస్టెంట్ కమిషనర్ వేణుమాధవ్, కార్పొరేటర్లు గందె మాధవి, బోనాల శ్రీకాంత్, నేతికుంట యాదయ్య, వాల రమణారావు, బండారి వేణు, నాంపల్లి శ్రీనివాస్, షర్ఫొద్దీన్, ఫిరోజ్, మాజీ డిప్యూటీ మేయర్ అబ్బాస్ సమి, బండ సుమరమణారెడ్డి, వంగల శ్రీదేవి పవన్ తదితరులు పాల్గొన్నారు.

రైతులందరికీ రుణమాఫీ చేయాలి

- బీఆర్ఎస్ ఆధ్వర్యంలో ధర్నా, రాస్తారోకో



హుజూరాబాద్‌లో రాస్తారోకో చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

హుజూరాబాద్, ఆగస్టు 22: హుజూరాబాద్ పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తాలో గురువారం రాష్ట్ర ప్రభుత్వం రైతులకు రుణమాఫీ పూర్తి స్థాయిలో చేయాలని డిమాండ్ చేస్తూ బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో ధర్నా, రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి ఇంటి నుంచి బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు నినాదాలు చేస్తూ అంబేద్కర్ చౌరస్తా వరకు చేరుకుని కరీంనగర్-హనుమకొండ రహదారిపై బైఠాయించారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. విషయం తెలుసుకున్న పోలీసులు ధర్నా చేస్తున్న బీఆర్ఎస్ నాయకులను అదుపులోకి తీసుకున్నారు. అనంతరం బీఆర్ఎస్ నాయకులు మాట్లాడుతూ ఆగస్టు 15 వరకు రూ.31వేల కోట్లు రుణమాఫీ చేస్తామని చెప్పి కేవలం రూ. 17వేల కోట్లు మాత్రమే రుణమాఫీ చేశారన్నారు. రాష్ట్ర ప్రభుత్వం సిగ్గు తెచ్చుకొని వెంటనే ఎలాంటి షరతులు లేకుండా రూ. 2లక్షల రుణమాఫీ చేయాలని డిమాండ్ చేశారు.

సైదాపూర్: మండల కేంద్రంలో బీఆర్ఎస్ నాయకులు నిరసన తెలిపారు. అనంతరం తహసీల్దార్ మంజులకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు సోమారపు రాజయ్య, మాజీ ఎంపీపీ ప్రభాకర్‌రెడ్డి, సింగిల్‌విండో అధ్యక్షుడు బిల్ల వెంకట్‌రెడ్డి, నాయకులు రాజేశ్వర్‌రెడ్డి, గాజర్ల ఓదెలు, మాదం స్వామి, మాజీ సర్పంచులు, మాజీ ఎంపీటీసీలు పాల్గొన్నారు.

చొప్పదండి: రుణమాఫీపై సీఎం రేవంత్‌రెడ్డి రైతులను మోసం చేశారని మాజీ ఎమ్మెల్యే సుంకే రవిశంకర్ అన్నారు.గురువారం చొప్పదండిలో బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో ధర్నా కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ఎన్నికలలో ఇచ్చిన హామీ మేరకు రైతులకు రుణమాఫీ చేయలేదన్నారు.మూడు విడుతలలో కూడా రుణమాఫీ కాలేదని, ప్రభుత్వం కుంటి సాకులు చెబుతూ తప్పించుకోవాలని చూస్తే ఊరుకోబోమని, అర్హులందరికీ రుణమాఫీ చేయాల్సిందేనని ఆయన అన్నారు. కాగా సిఎం రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను దగ్ధం చేయడానికి ప్రయత్నించగా పోలీసులు అడ్డుకున్నారు .ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ ఏనుగు రవీందర్‌రెడ్డి సింగిల్ విండో చైర్మన్ మినుపల తిరుపతిరావు, పార్టీ మండల అధ్యక్షుడు వెల్మ శ్రీనివాస్ రెడ్డి నాయకులు ఆరెల్లి చంద్రశేఖర్‌గౌడ్, మాచర్ల వినయ్, గడ్డం చుక్కారెడ్డి, చీకట్ల రాజశేఖర్, కొత్తూరు మహేష్ నలుమాచు రామకృష్ణ, వెల్మ నాగిరెడ్డి, ఏనుగు స్వామిరెడ్డి, మామిడి రాజేశం, గన్ను శ్రీనివాస్‌రెడ్డి, సీపెల్లి గంగయ్య, గాండ్ల లక్ష్మణ్, రాజశేఖర్, గొల్లపల్లి శ్రవణ్ కుమార్, రావణ్, మహేష్, శ్రీనివాస్ పాల్గొన్నారు

మానకొండూర్: మానకొండూర్‌లో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో రైతు ధర్నా నిర్వహిం చారు. కార్యక్రమంలో మాజీ ఎంపీ బోయినిపల్లి వినోద్‌కుమార్, మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు జీవి రామకృష్ణారావు, మాజీ జడ్పీ వైస్ చైర్మన్ సిద్దం వేణు, మాజీ జడ్పీటీసీలు తాల్లపల్లి శేఖర్‌గౌడ్, శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గంగాధర: గంగాధర ప్రధానరహదారిపై బీఆర్ఎస్ నాయకులు ధర్నా నిర్వహిం చారు. కార్యక్రమంలో పార్టీ మండలాధ్యక్షుడు నవీన్‌రావు, మాజీ సర్పంచ్‌లు కంకణాల విజేందర్‌రెడ్డి, దామోదర్, నాయకులు ఆకుల మధుసూదన్, నాగారపు సత్యనారా యణ, మల్లయ్య, సురేందర్, అజయ్ పాల్గొన్నారు.

చిగురుమామిడి: మండలంలోని చిన్నముల్కనూర్‌లో బీఆర్ఎస్ నాయకులు రైతు ధర్నా నిర్వహించారు. ధర్నా విరమించాలని కోరిన ఎస్సై బండి రాజేశ్‌తో బీఆర్ఎస్ నాయకులు వాగ్వాదానికి దిగారు. దీంతో పోలీస్‌లు నాయకులను అదుపులోకి తీసుకున్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ జిల్లా నాయకుడు కొత్త శ్రీనివాస్‌రెడ్డి, పార్టీ మండల అధ్య క్షుడు మామిడి అంజయ్య, సింగిల్ విండో చైర్మన్ జంగ వెంకటరమ ణారెడ్డి, పెనుకుల తిరుపతి, సాంబారి కొమురయ్య, రామోజు కృష్ణమాచారి, మాజీ వైస్ ఎంపీపీ రాజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రామడుగు: మండల కేంద్రంలో బీఆర్ఎస్ పార్టీ నాయకులు ధర్నా నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ మార్కెట్ చైర్మన్ మామిడి తిరుపతి, మాజీ ఎంపీపీ మార్కొండ క్రిష్టారెడ్డి, కలిగేటి లక్ష్మణ్, మాజీ మార్కెట్ వైస్ చైర్మన్ చాడ ప్రభాకర్‌రెడ్డి, జిల్లా రైతు బంధు సభ్యులు సంజీవరావు, మాజీ సర్పంచులు పంజాల జగన్ మోహన్‌గౌడ్, వీర్ల రవీంద్రరావు, చాడ చంద్రశేఖర్‌రెడ్డి, దాసరి రాజేందర్‌రెడ్డి, ఒంటెల వెంకటరమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



చొప్పదండిలో ధర్నా చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

జమ్మికుంటలో వైద్య శిబిరం

జమ్మికుంట, ఆగస్టు 22: జమ్మికుంట పట్టణంలోని హౌసింగ్‌బోర్డు కాలని, కొత్తపల్లిలో గురువారం వైద్య శిబిరం నిర్వహించారు. హౌసింగ్‌బోర్డు కాలనిలో డాక్టర్ మోహనత్ ఆధ్వర్యంలో 50మంది కాలనివాసులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. వావిలాల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో కొత్తపల్లిలో వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో డాక్టర్ ఫర్హానుద్దీన్, హెల్త్ ఎడ్యూకేటర్ మోహన్‌రెడ్డి, హెల్త్ సూపర్వైజర్ అరుణ, కౌన్సిలర్ శ్రీపతి నరేష్, ఏఎన్ఎమ్‌లు వాణిశ్రీ, మంజుల, రజిత, ఆర్పీ లత తదితరులు పాల్గొన్నారు.

రుణమాఫీ అయిన రైతులు ధర్నా చేయడం సరికాదు

- కాంగ్రెస్ మండలాధ్యక్షుడు దొంత సుధాకర్

సైదాపూర్, ఆగస్టు 22: రుణమాఫీ అయిన రైతులు ధర్నా చేయడం సరికాదని కాంగ్రెస్ మండలాధ్యక్షుడు దొంత సుధాకర్ అన్నారు. కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. రుణమాఫీ అయిన రైతులు ప్రభుత్వాన్ని విమర్శించడం సరికాదన్నారు. అర్హత ఉన్న ప్రతీ రైతుకు కాంగ్రెస్ ప్రభుత్వం రుణమాఫీ చేసుందన్నారు. బీఆర్ఎస్ నాయకులు కావాలనే రైతులను రెచ్చగొడుతున్నారని, రైతులు ఆందోళన చెందవద్దని విజ్ఞప్తి చేశారు. సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం దరఖాస్తులు తీసుకుంటున్నదని చెప్పారు. అధికారులను కలిసి సమస్యను రైతులు పరిష్కరించుకోవాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో రాజు, వెంకటేశ్వర్‌రావు, తిరుపతి నాయక్, నవీన్, రఘు తదితరులు పాల్గొన్నారు.

రెండు బైక్‌లు సీజ్

కరీంనగర్ క్రైం, ఆగస్టు 22: సౌండ్‌పొల్యూషన్‌కు పాల్పడుతూ అతివేగంగా వెళుతున్న రెండు బుల్లెట్ వాహనాల సీజ్‌చేశామని మూడో ఠాణా పోలీసులు తెలిపారు. డీమార్ట్ చౌరస్తా వద్ద గురువారం నిర్వహించిన తనిఖీలలో అతివేగంగా వెళుతూ సౌండ్‌పొల్యూషన్‌కు పాల్పడిన 2 బుల్లెట్ బైక్‌లను సీజ్ చేసి ఠాణాకు తరలించామని తెలిపారు. వాహనాలు నడిపిన ఇద్దరు వ్యక్తులపై కేసులు నమోదు చేశామన్నారు. ఈ రెండు బైక్‌లను కోర్టులో డిపాజిట్ చేయనున్నట్లు పోలీసులు తెలిపారు.

నటుడు చిరంజీవి జన్మదిన వేడుకలు

కరీంనగర్ కల్చరల్, ఆగస్టు 22: సినీ నటుడు చిరంజీవి 69వ జన్మదిన వేడుకలను గురువారం రాష్ట్ర చిరంజీవి యువత అధ్యక్షుడు వేల్పుల వెంకటేశ్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. అంబేద్కర్ స్టేడియంలో కేక్ కట్ చేసి మొక్కలు నాటారు. కార్యక్రమంలో పెంచాల కిషన్‌రావు, నీలం లక్ష్మణ్, ఆడెపు కమలాకర్, అన్నవరపు సుధాకర్‌రావు, డిష్ మధు, శ్రీనివాస్, సుమన్, పొన్నం రాజు, కపిల్, గాలిపెల్లి కుమార్, చొక్కారపు చంద్రం పాల్గొన్నారు.

●టవర్‌సర్కిల్ ప్రాంతంలో చిరంజీవి అభిమానులు కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్లు సాదవేని శ్రీనివాస్, మాచర్ల ప్రసాద్ పాల్గొన్నారు.

●జమ్మికుంట రూరల్: జమ్మికుంట పట్టణంలోని శ్రీసత్యసాయి దివ్యాంగుల ప్రత్యేక పాఠశాలలో మెగా ఫ్యామిలీ అభిమాన సంఘాల జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ పర్లపల్లి రమేష్ ఆధ్వర్యంలో చిరంజీవి జన్మదిన వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా కేకు కట్ చేసి పండ్లు, స్వీట్లు పంపిణీ చేసి, పాఠశాల ఆవరణలో పండ్ల మొక్కలు నాటారు. కార్యక్రమంలో సంపెల్లి రవి, కనవేన నాగరాజు, రాచపల్లి ప్రశాంత్, సముద్రాల సంపత్, రాచపల్లి చింటు పాల్గొన్నారు.

'రైతుల సంక్షేమాన్ని పట్టించుకోని బీఆర్ఎస్'

కరీంనగర్ అర్బన్, ఆగస్టు 22 : గత బీఆర్ఎస్ పాలకులు పదేళ్ల కాలంలో ఏనాడు రైతులను, రైతు సంక్షేమాన్ని పట్టించు కోలేదని కాంగ్రెస్ పార్టీ కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గ ఇన్‌చార్జి వెలిచాల రాజేందర్‌రావు గురువారం ఒక ప్రకటనలో విమర్శించారు. బీఆర్ఎస్ ప్రభుత్వం గత 10 ఏళ్ల కాలంలో చేయని రుణమాఫీని సీఎం రేవంత్‌రెడ్డి సారథ్యంలోని కాంగ్రెస్ ప్రభుత్వం 8 నెలల కాలంలో చేస్తే ఆ పార్టీకి కడుపు మంట ఎందుకని ప్రశ్నించారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతును రాజు చేయడమే లక్ష్యంగా ముందుకు సాగుతుందని వెలిచాల రాజేందర్‌రావు పేర్కొన్నారు.

సాయి ఆలయంలో అన్నదానం

కరీంనగర్ కల్చరల్, ఆగస్టు 22: శ్రావణమాసం సందర్భంగా గురువారం భాగ్యనగర్ సాయిబాబా ఆలయంలో మేయర్ సునీల్‌రావు-అపర్ణ దంపతులు అన్నదానం చేశారు. అంతకు ముందు ప్రత్యేక పూజలు జరిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ నిర్వాహకులు, భక్తులు పాల్గొన్నారు.

హిందూ ధర్మాన్ని కాపాడాలి

భగత్‌నగర్, ఆగస్టు22: హిందూ ధర్మాన్ని కాపాడాలని గోరఖ్‌పూర్ మఠాధిపతి శ్రీ శ్రీ అతిథి స్వామీజీ అన్నారు. విశ్వహిందూ పరిషత్ 60 సంవత్సరాల నేపథ్యంలో హిందూ మత ప్రచారంలో భాగంగా గురువారం కరీంనగర్‌లోని రేకుర్తిలో గల బుడగ జంగాల కాలనీలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈసందర్భంగా స్వామీజీ మాట్లాడుతూ దేశంలో కొన్ని దేశ వ్యతిరేక శక్తులు మత మార్పిడులకు పాల్పడుతున్నాయని అన్నారు. కార్యక్రమంలో విభాగ్ గోరక్ష ప్రముఖ్ ఊట్కూరి రాధాకృష్ణరెడ్డి, నగర అధ్యక్షులు ఇనగటి రమేష్, విశ్వహిందూ పరిషత్, బజరంగ్దళ్ కార్యకర్తలు గంగా చారి, అజయ్ సాయి, మల్లేశం, తదితరులు పాల్గొన్నారు.

లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో ఉచిత శస్త్ర చికిత్సలు

భగత్‌నగర్, ఆగస్టు 22: నగరంలోని లయన్స్‌క్లబ్ మంకమ్మతోట ఆధ్వర్యంలో రేకుర్తి కంటి ఆసుపత్రిలో ఉచితంగా కంటి శస్త్ర చికిత్సలు నిర్వహించారు. నల్లగొండ గ్రామానికి చెందిన 60మందికి కంటి పరీక్షలు నిర్వహించి 19మందికి శస్త్ర చికిత్స కోసం ఆసుపత్రికి పంపించగా అందులో 15 మందికి ఉచితంగాకంటి శస్త్ర చికిత్సలు నిర్వహించారు. రోగులకు పండ్లు పంపిణీ చేసి ఉచితంగా బస్సులో గ్రామానికి పంపించారు. కార్యక్రమంలో లయన్ బూర్ల విద్యాసాగర్, లయన్ అంబటి రవీందర్‌రాజు, లయన్ పాత శేఖర్, ఆసుపత్రి వైస్ ఛైర్మన్ చిదుర సురేష్, గుండోజు లక్ష్మయ్య, పాత విశ్వనాథం తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు వ్యాసరచన పోటీలు

చొప్పదండి, ఆగస్టు 22: పట్టణంలోని మండల వనరుల కేంద్రంలో గురువారం విద్యార్థులకు వ్యాసరచన, డిబేట్ పోటీలను నిర్వహించారు. ఈ సందర్భంగా గెలుపొందిన విద్యార్థులకు మండల విద్యాధికారి వేణుకుమార్ బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పుష్పలత, లక్ష్మణ్, శ్రీనిజ, పిడి కృష్ణ, సీఆర్పీలు అశోక్, శ్రీనివాస్, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

ఏడీఏగా ప్రియదర్శిని బాధ్యతల స్వీకరణ

గంగాధర, ఆగస్టు 22: గంగాధర ఏడీఏగా ప్రియదర్శిని గురువారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పని చేసిన రామారావును వేములవాడకు బదిలీ చేయగా డీడీఏ ఎఫ్‌టీసీలో పని చేసిన ప్రియదర్శిని గంగాధరకు బదిలీ చేశారు. ఈసందర్భంగా విధుల్లో చేరిన ప్రియదర్శిని మాట్లాడుతూ రైతు సమస్యల పరిష్కారానికి, పంటల దిగుబడికి రైతులకు సలహాలు సూచనలందించడానికి కృషి చేస్తానని తెలిపారు.

ప్రజా సమస్యలపై ఎమ్మెల్యే దృష్టి పెట్టాలి

రామడుగు, ఆగస్టు 22: మండలంలో పేరుకపోయిన సమస్యలపై ఎమ్మెల్యే దృష్టి సారించి పరిష్కరించాలని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు కట్ట కోల లక్ష్మణ్ కోరారు. స్థానికంగా గురువారం ఆయన మాట్లాడుతూ మండల కేంద్రంలో నూతన బ్రిడ్జి నిర్మాణం పూర్తయిన ఎందుకు ప్రారంభించడం లేదని ప్రశ్నించారు. బ్రిడ్జి అందుబాటులోకి రాకపోవడంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారని, వెంటనే సమస్యను పరిష్కరించాలని కోరారు. సమావేశంలో నాయకులు శ్రీనివాస్, రవీందర్, నాంపల్లి గౌస్ పాల్గొన్నారు.

విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించాలి

ఇల్లందకుంట, ఆగస్టు 22: ప్రతి విద్యార్థిని చదువుతో పాటు అన్ని రంగాల్లో రాణించాలని మండల విద్యాధికారి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. గురువారం మండలంలోని శ్రీరాములపల్లె గ్రామంలోని కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయంలో వాయిస్ ఫర్ ఫోర్ గర్ల్స్ అనే స్వచ్ఛంద సంస్థ చేపట్టిన కార్యక్రమంలో ఎంఈవో శ్రీనివాస్‌రెడ్డి, ఎంపీవో రాజేశ్వర్‌రావు, సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు. హైదరాబాద్‌కు చెందిన వాయిస్ 4గర్ల్స్ అనే ఎన్‌జీవో ప్రస్తుతం 10రోజుల హర్ వాయిస్ క్యాంపు కార్యక్రమాన్ని గురువారం ప్రాంభించారు.కార్యక్రమంలో కేజీబీవీ ప్రత్యేకాధికారి రమాదేవి, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ శ్రీమతి అనూషా భరద్వాజ్ పాల్గొన్నారు.

మిత్రుడికి ఆర్థిక సహాయం అందజేత

శంకరపట్నం, ఆగస్టు 22: తల్లిదండ్రులను కోల్పోయి ఒంటరిగా మిగిలిన తోటి మిత్రుడికి అతని పదో తరగతి మిత్రులు గురువారం ఆర్థిక సహాయం అందజేసి అండగా నిలిచారు. శంకరపట్నం మండలం లింగాపూర్ గ్రామానికి చెందిన మారవేణి శ్రీశైలం తల్లి మారవేణి నీలమ్మ పదేళ్ల క్రితం మృతి చెందింది. కాగా తండ్రి మారవేణి లక్ష్మయ్య గత వారం రోజుల క్రితం మృతి చెందాడు. తల్లిదండ్రులను కోల్పోయి ఒంటరి వాడైన శ్రీశైలంకు అతని పదో తరగతి స్నేహితులు రూ. 21వేలు ఆర్థిక సహాయం అందజేసి అండగా నిలిచారు.